Follow: @ANNTELUGU

28-05-2026

# మహా పత్రిక

ANN తెలుగు

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 150 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM






## టీడీపీ మరో చారిత్రక అడుగు

### మహిళలకు 33శాతం సీట్లు

- మహిళా రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండానే అమలు చేస్తామని స్పష్టం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తొలి మహానాడులోనే కీలక ప్రకటన
- మహానాడులో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన లోకేష్

03

టాప్ న్యూస్

## 30న సీఎంగా డీకే ప్రమాణస్వీకారం?



- నేడు సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసే సూచనలు
- బెంగళూరుకు చేరనున్న ఏఐసీసీ నేతలు కేసీ వేణుగోపాల్, సూర్జేవాలా
- 29న సీఎల్పీ సమావేశంలో డీకే పేరుకు ఆమోదం పొందే అవకాశం

02

## తుమ్మిడిహెట్టి ఎత్తుపై చర్చకు సిద్ధం



- మహారాష్ట్ర సీఎంకు రేవంత్ రెడ్డి లేఖ
- తుమ్మిడిహెట్టి బ్యారేజ్ రీ-డిజైనింగ్, ఎత్తు పెంపుపై చర్చకు తెలంగాణ సిద్ధం
- 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ తెలంగాణ అవసరాలకు సరిపోదని స్పష్టం

02

## ఢిల్లీలో దళపతి



- ప్రధాని మోదీని కలిసిన తమిళనాడు సీఎం విజయ్
- ఢిల్లీలోని సేవాతీర్థలో ప్రధాని మోదీతో 20 నిమిషాల సమావేశం
- చెన్నై మెట్రో విస్తరణ, జీఎస్టీ బకాయిలపై ప్రధాన చర్చ

02



కేరళలో ఈడీ అధికారుల వాహనంపై

## రాళ్ళ దాడి

- మాజీ సీఎం విజయన్ ఇంట సోదాలు
- సీపీఎం శ్రేణుల ఆగ్రహం.. ఉద్రిక్తత

02

మీరు మారిపోయారు సార్..

# రాహుల్.. రాజకీయం

### సౌత్ లో.. ఫ్రెష్ పాలిటిక్స్



తమిళనాడు, కేరళం, కర్నాటకలో అనూహ్య ఎత్తుగడలు

ప్రజా మద్దతు ఉన్నవారికే.. పీఠం

2029పై సీరియస్‌గా గురి

(మహా నెట్ వర్క్):

సౌత్ లో సరికొత్త రాజకీయానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెరలేపారు. దక్షిణభారతదేశంలో కాంగ్రెస్ కు తిరుగులేని పట్టు ఉండగా, ఒక్క ఏపీ మినహా అన్ని రాష్ట్రాల్లో నూ కాంగ్రెస్ దే హవా. దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రత్యక్షంగా నాలుగు చోట్ల అధికారంలో ఉంది. కర్నాటక, కేరళం, తెలంగాణలో నేరుగా ప్రభుత్వాలను నడుపుతోంది. తమిళనాడులోనూ తొలిసారి ప్రభుత్వంలో చేరి మిగితా 2వ పేజీలో





భారీ నాలాలను ఆక్రమించి మైల్ స్టోన్

అత్వెల్లి లో బరితెగించిన

# అక్రమం

### రియల్ మాఫియా కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం

**నాలాలు, అలుగులు మింగిన మైల్ స్టోన్ మాయా కంపెనీ**

వరద ప్రవాహానికి చెరువు కట్ట తెగితే పరిస్థితి ఏంటి..?

గ్రామాలకు, లే అవుట్‌కు పొంచి ఉన్న పెను ప్రమాదం

అడ్డగోలుగా ఎన్వోసీ జారీ చేసిన అధికారులపై కలెక్టర్ కన్నెర్ర

ఇరిగేషన్, రెవెన్యూ జాయింట్ సర్వే రిపోర్ట్ కోరిన కలెక్టర్

03



## దేశంలో తొలి హైడ్రోజన్ రైలుకు గ్రీన్ సిగ్నల్

- జింద్-సోనిపట్ మార్గంలో 10 బోగీలతో పరుగులు
- గంటకు 75 కిలోమీటర్ల గరిష్ఠ వేగం.
- కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడే టెక్నాలజీ.

02

చెరువు శిఖాన్ని ఆక్రమించిన

## మైహోమ్ సంస్థ

### రూ.1,800 కోట్ల భూమిని కాపాడిన 'హైడ్రా'

- మాదాపూర్ ఐటీ కారిడార్‌లో ఈదులకుంటను మాయం చేసేందుకు కుట్ర.
- వరద కాలువను డైవర్ట్ చేసి.. రూపురేఖలు మార్చేసి స్కైస్క్రాపర్స్ నిర్మాణానికి స్కెచ్.
- శాటిలైట్ చిత్రాలు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా కంచె వేసిన అధికారులు.

02





## సీసీఐ పాపం ముమ్మాటికి పాయల్ శంకర్‌దే

- భూ మాఫియా, మైనింగ్ మాఫియా తో దోపిడి
- ఎమ్మెల్యే పాయల్ శంకర్‌వి శిఖండి రాజకీయాలు
- అటో కాలు ఇటో కాలు వేసి రాజకీయాలు చేస్తున్నడు
- చివరికి ఎటూ కాకుండా పోతడు
- అసలు నువు బీజేపీ ఎమ్మెల్యేవేనా ..?
- ప్రెస్ మీట్ లో కంది శ్రీనివాస రెడ్డి ధ్వజం

03

## కబ్జాకోరులపై 'హైడ్రా' పంజా

03



# చేసి చూపిస్తాం

### ఇందిరమ్మ ఇళ్ళపై మంత్రి పొంగులేటి ఓపెన్ ఛాలెంజ్

కేటీఆర్ వ్యాఖ్యలపై ఫైర్.. హైదరాబాద్ లో లక్ష ఇందిరమ్మ

పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంఖుస్థాపన

**హైదరాబాద్, మహా :** జీహెచ్ఎంసీ ప్రాంతంలో మా ప్రభుత్వం బీఆర్ఎస్ కంటే ఎక్కువ ఇండ్లు కడితేనే వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేస్తానని, చెప్పినట్లు మేము ఎక్కువ ఇండ్లు కట్టి చూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకు కేటీఆర్ సిద్ధమా అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. 'హైదరాబాద్ నగరంలో రేవంత్ రెడ్డి ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటాను' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హౌసింగ్ శాఖనే పూర్తిగా డిస్మాండిల్ చేశారని, ఏనాడైనా పేదవారి ఆలోచనలను పరిగణలోకి తీసుకున్నారా అని నిలదీశారు. బుధవారం హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని నాంపల్లి, మలక్‌పేట్, బహదూర్‌పురా నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనువైన ఖాళీ స్థలాలను, నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవన సముదాయాలను మంత్రి అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మిగితా 2వ పేజీలో

03



## ఏపీలో లోకల్ వార్

- సిద్ధం కావాలన్న సర్కార్

**అమరావతి, మహా :** ఏపీలో లోకల్ వార్ కు రంగం సిద్ధమైంది. స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఇటు సీఎం చంద్రబాబు, అటు జనసేనాని డీసీఎం పవన్ కల్యాణ్ క్యాడర్ కు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు పూర్తి కాగా, స్థానిక విజయాల ద్వారా ప్రభుత్వానికి ప్రజామద్దతు తిరుగులేని విధంగా ఉందని చాటాలని టీడీపీ భావిస్తోంది. అటు వైఎస్ జగన్ కూడా స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయని ప్రతిచోటా పోటీ పడాల్సిందేనని తేల్చిచెప్పారు. జూలై తర్వాత ఉండొచ్చని, దసరాలోగా పూర్తిచేసే ఆలోచనలో ఉన్నారని ప్రభుత్వవర్గాలు అంటున్నాయి.



# కేరళలో ఈడీ అధికారుల వాహనంపై రాళ్ళ దాడి

**తిరువనంతపురం, మహా.** కేరళ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ అవినీతి కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేరళ వ్యాప్తంగా సోదాలు చేపట్టడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ నివాసంతో పాటు రాష్ట్రంలోని మరో 10 కీలక ప్రాంతాలలో బుధవారం ఈడీ అధికారులు ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ పరిణామంతో ఆగ్రహోదగ్రులైన అధికార సీపీఐ(ఎం) కార్యకర్తలు, లెఫ్ట్ ఫ్రంట్ శ్రేణులు తిరువనంతపురంలోని పినరయి విజయన్ అధికారిక నివాసం వెలుపల భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సోదాలు ముగించుకుని బయటకు వస్తున్న ఈడీ అధికారుల వాహనాన్ని నిరసనకారులు అడ్డుకుని, దానిపై తీవ్ర స్థాయిలో దాడికి తెగబడటంతో రాజధాని నగరంలో తీవ్ర రసాభాస నెలకొంది.

**అసలేం జరిగిందంటే..**

కేరళలో గత కొంతకాలంగా సంచలనం సృష్టిస్తున్న సీఎంఆర్ఎల్ ఆర్థిక అక్రమాల వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణాన్ని దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు.. బుధవారం ఉదయాన్నే పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగారు. మాజీ సీఎం పినరయి విజయన్‌కు సంబంధించిన నివాసాలు, ఆయన కుటుంబ సభ్యులకు సన్నిహితంగా ఉండే వ్యక్తుల ఇళ్లే లక్ష్యంగా ఈ దాడులు సాగాయి. కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి ప్రతిపక్షాలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారంటూ ఈ వార్త తెలియగానే సీపీఎం శ్రేణులు భారీ సంఖ్యలో పినరయి విజయన్ నివాసానికి చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి, ఈడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించాయి. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నప్పటికీ.. నిరసనకారులు ఒక్కసారిగా ఈడీ అధికారుల కాన్వాయ్‌పైకి దూసుకెళ్లి, అధికారుల వాహన అద్దాలను పగులగొట్టడానికి ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

**రాజకీయ కక్షసాధింపు చర్యే: సీపీఎం**

ఈ దాడులను సీపీఐ(ఎం) నాయకత్వం తీవ్రంగా ఖండించింది. రాజకీయంగా తాము ఎదుర్కొనలేకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడింది. పినరయి విజయన్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే ధ్యేయంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఈ సోదాలు నిర్వహిస్తున్నారని ఆరోపించింది. అయితే, చట్ట ప్రకారం లభించిన ఆధారాల ఆధారంగానే తాము సోదాలు నిర్వహిస్తున్నామని, దర్యాప్తుకు అందరూ సహకరించాల్సిందేనని ఈడీ వర్గాలు స్పష్టం చేశాయి. తిరువనంతపురంలో చోటుచేసుకున్న ఈ దాడి నేపథ్యంలో పినరయి విజయన్ నివాసం వద్ద ఈడీ ప్రాంతీయ కార్యాలయాల వద్ద పోలీసులు అదనపు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## మీరు మారిపోయారు సార్..
# రాహుల్..రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

అధికారం పంచుకుంటోంది. ఇక మిగిలింది ఆంధ్రప్రదేశ్ మాత్రమే. ఏపీ రాజకీయాల్ని పక్కనబెడితే దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీ దూకుడు, రాహుల్ గాంధీ నిర్ణయాలు చూసి ప్రత్యర్థులే ఆశ్చర్యపోతున్నారు. గతంలో కాంగ్రెస్ తప్పుడు నిర్ణయాలతో నష్టపోగా, ఇపుడు ఎక్కడ నష్టపోయామో గ్రహించినట్లుగా బిజెపికి, ప్రత్యర్థులకు షాకిచ్చే నిర్ణయాలు తీసుకుంటూ భవిష్యత్ మనదే అంటోంది. రాహుల్ గాంధీ రాజకీయ శైలిలో స్పష్టమైన మార్పుకు తాజా నిర్ణయాలు సంకేతంగా భావిస్తున్నారు. గత కొద్ది వారాలుగా ఆయన తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు పార్టీలో చర్చకు దారితీస్తున్నాయి. కాంగ్రెస్ వర్గాలు రాహుల్ గాంధీ ని మీరు మారిపోయారు సార్ అంటున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని.. పార్టీలో ఉత్సాహం నింపడంలో తాజా చర్యలు దోహదపడుతున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా, పార్టీలో అంతర్గత, బహిరంగ విమర్శకులు రాహుల్ గాంధీకి కఠినమైన రాజకీయ నిర్ణయాలు తీసుకునే అధికారం, ఆ నైపుణ్యం లేదని ప్రశ్నించగా, ఇపుడు పూర్తి భిన్నంగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. ప్రియాంక మద్దతు కూడా రాహుల్ కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకభూమిక పోషిస్తోందని వినబడుతోంది. బిజెపి ఎక్కువగా, 5060 ఏండ్ల మధ్య ఉన్నవారికే పదవులు అప్పగిస్తుండగా, కాంగ్రెస్ లోనూ యువతరాన్ని ప్రోత్సహించాలని డిసైడ్ అయ్యారు. ఈ విధంగా ముందుకెళ్తే రాహుల్ ను ఆపేవారుండరని నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



**తమిళనాడుతో విజయం**

తమిళనాడులో విజయ్ కు అనూహ్యమద్దతునివ్వడం ద్వారా తమిళనాడు రాజకీయ ముఖచిత్రాన్ని రాహుల్ గాంధీ మార్చేశారు. రెండు ద్రవిడపార్టీలకు చెక్ పెట్టడంతో పాటు సౌత్ లో సరికొత్త బెంచ్ మార్క్ ను సెట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ డీఎంకే కూటమిపై పూర్తిగా ఆధారపడకుండా, టీవీకే విజయ్‌తో ఒక అవగాహన కుదుర్చుకోవాలని భావించినా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొదట్లో దీనిపై సుముఖంగా లేరు. డీఎంకే నుండి దూరం కావడం ప్రమాదకరమంటూ హెచ్చరించారు. విజయ్ ప్రవేశం తమిళనాడు రాజకీయ సమీకరణాలను మార్చగా, సరైన సమయం చూసి రాహుల్ దూకుడుగా వ్యవహరించారు. డీఎంకేకు కటీఫ్ చెప్పారు. ఇతర మిత్రపక్షాలను కూడా దూరం చేశారు. విజయ్ ప్రభావం పక్క రాష్ట్రాలపై కూడా ఉండనుంది.

**కేరళలో ప్రజానేతకే పట్టం**

కేరళలోనూ అనూహ్య నిర్ణయం తీసుకుని రాహుల్ గాంధీ కేరళ ప్రజల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సీనియర్ నాయకుడైన కేసీ వేణుగోపాల్ ను కాదని యువ నాయకుడు వీడీ సతీశన్‌ను పార్టీ భవిష్యత్తు ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంచుకుంది. కేసీ వేణుగోపాల్ కు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చినా, ప్రజా మద్దతు ఉన్న వీడీ సతీశన్ నే రాహుల్ సీఎంగా ఎంపిక చేశారు. ఢిల్లీ కేంద్రంగా దశాబ్దాలుగా సాగిన కాంగ్రెస్ రాజకీయాలకు విరుద్ధంగా ప్రజా మద్దతుకు అధిష్టానం ఇచ్చిన గౌరవంగా రాజకీయ విశ్లేషకులు సైతం రాహుల్ నిర్ణయంపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సతీశన్‌కు తక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ ఆయనవైపే మొగ్గారు. నిర్ణయం తర్వాత ప్రజల్లో వచ్చిన ఆమోదం పార్టీలో ఉత్సాహం నింపింది.

**కర్నాటకలోనూ సీఎం ఛేంజ్**

గత ఏడాది కాలంగా సాగుతున్న కర్నాటకానికి రాహుల్ గాంధీ తెరవేశారు. సిద్ధరామయ్య నుండి డీకే శివకుమార్‌కు జరగబోయే మార్పిడిని కాంగ్రెస్ లోపల రాజకీయ సమతుల్యత సాధించడానికి, ముందుచూపుతో 2029 ఎన్నికల కోసం తీసుకున్న నిర్ణయంగా చూస్తున్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నుండి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నాయకత్వ మార్పిడి అనేది పూర్తిగా రాహుల్ గాంధీ నిర్ణయమే. గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ప్రజా మద్దతు గమనించి సిద్ధరామయ్యకు సీఎం పగ్గాలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ.. ఆయనకు గట్టి పోటీదారుగా ఉన్న డీకే శివకుమార్ కు డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టింది. అయితే భవిష్యత్తులో అవకాశం కల్పిస్తామని హామీ కూడా ఇచ్చింది. ఆ హామీ నిలబెట్టుకోవడం ద్వారా ప్రస్తుతం దక్షిణాదిపై పెరుగుతున్న తమ పట్టును కొనసాగించే అవకాశం ఇప్పుడు రాహుల్ గాంధీకి వచ్చింది. దీని ఫలితమే సిద్ధరామయ్యను పెద్దల సభకు పంపడంతో పాటు డీకే శివకుమార్ కు సీఎం పదవి అని భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా కర్నాటకలో ప్రజా వ్యతిరేకతను అధిగమించడంతో పాటు క్యాడర్ లో ఇపుడే అధికారంలోకి వచ్చినట్లు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తున్నారు.

**తెలంగాణతోనే మొదలు**

వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ ప్రజామోదం ఉన్న.. యువనేతకు పట్టం కట్టడం తెలంగాణతోనే ప్రారంభించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘకాలం పెట్టుకున్న సంప్రదాయ రాజకీయాలకు విరుద్ధం. ఆ నిర్ణయం హిట్ అయి.. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో వేవ్ తీసుకొచ్చి, సౌత్ లోనూ ఓ బెంచ్ మార్క్ ను, పాపులారిటీని సెట్ చేసింది. ఇపుడు వరుసగా సౌత్ లో కాంగ్రెస్ బలంగా, స్థిరంగా నిర్ణయాలు తీసుకుంటూ రాహుల్ గాంధీ భవిష్యత్తు మనదేనని భరోసా కల్పిస్తున్నారు. తమిళనాడు, కేరళ ప్రభావంతో ఇటీవల కాలంలో ఏపీలోనూ కాంగ్రెస్ లోకి వలసలు పెరిగాయి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏపీ అసెంబ్లీలోనూ అడుగుపెట్టడం ఖాయమన్న అంచనాలు పార్టీలో ఉన్నాయి.



# చేసి చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కంటే ఎక్కువ సంఖ్యలో ఈ రెండున్నరేళ్లలో కట్టి చూపిస్తామన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పేదలు నివసించే ప్రాంతంలోనే ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇందుకోసం ఎంత ఖర్చైనా ప్రభుత్వం భరిస్తుందన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కోర్ అర్బన్ రీజియన్ లోని పట్టణ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకోబోతున్నామని, అందుకు సంబంధించి అధికారులతో కలిసి యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోని ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని విడతల వారీగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామన్నారు.

## ఢిల్లీలో దళపతి

**ఢిల్లీ, మహా :** ఢిల్లీ పర్యటనలో ఉన్న తమిళనాడు సీఎం విజయ్, ప్రధాని మోదీని కలిశారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలోని సేవాతీర్థలో ప్రధానిని కలిసిన విజయ్ 20 నిమిషాల పాటు తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా చెన్నై మెట్రో రైలు విస్తరణ, జీఎస్టీబకాలయిలపై చర్చించారు. ప్రధాని మోదీతో సమావేశం అనంతరం ఢిల్లీలో తమిళనాడు భవన్ కు సీఎం విజయ్ చేరుకున్నారు. గురువారం ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పలువురు సీనియర్ కేంద్ర మంత్రులతో విజయ్ సమావేశం కానున్నారు.




# దేశంలో తొలి హైడ్రోజన్ రైలుకు గ్రీన్ సిగ్నల్

**ఢిల్లీ, మహా :** పర్యావరణ హితమైన, సుస్థిర రవాణా వ్యవస్థే ధ్యేయంగా భారత రైల్వే శాఖ ఒక చరిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా 'హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్' సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే సరికొత్త రైలును ప్రవేశపెట్టేందుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. ఉత్తర రైల్వే పరిధిలోని హర్యానా రాష్ట్రంలో గల జింద్‌సోనిపట్ మార్గంలో మొత్తం 10 బోగీలతో కూడిన ఈ హైడ్రోజన్ రైలును నడపనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ చొరవతో రైల్వే రంగంలో హైడ్రోజన్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి ప్రపంచంలోని అతికొద్ది అగ్రదేశాల సరసన భారతదేశం సగర్వంగా చేరింది. త్వరలోనే పటాల పైకి రానున్న ఈ సరికొత్త హైడ్రోజన్ రైలు గంటకు 75 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. దీని నిర్వహణ కోసం 1,200 కిలోవాట్ల అత్యంత శక్తిమంతమైన సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ వ్యవస్థను నిపుణులు రూపొందించారు. ఈ అధునాతన టెక్నాలజీలో హైడ్రోజన్‌ను ఇంధనంగా ఉపయోగించి రైలుకు అవసరమైన విద్యుత్‌ను స్వయంచాలకంగా ఉత్పత్తి చేస్తారు. ఈ రసాయన ప్రక్రియ జరుగుతున్నప్పుడు సైలెన్సర్ ద్వారా పర్యావరణానికి హాని చేసే కర్బన ఉద్గారాలు ఏవీ వెలువడవు, కేవలం స్వచ్ఛమైన నీటి ఆవిరి మాత్రమే బయటకు వస్తుంది. దీనివల్ల సంప్రదాయ డీజిల్ ఇంధనాలతో పోలిస్తే కాలుష్యం అనేది బొత్తిగా ఉండదు. దేశంలో కర్బన ఉద్గారాలను పూర్తిగా తగ్గించి, భారత రైల్వే నిర్దేశించుకున్న 'నెట్ జీరో' (శూన్య ఉద్గారాల) లక్ష్యాలను సమర్థవంతంగా చేరుకునేందుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడనుంది. ఈ ప్రతిష్ఠాత్మక పైలట్ ప్రాజెక్టు కోసం రైల్వే శాఖ హర్యానాలోని జింద్‌సోనిపట్ మార్గాన్ని ఎంపిక చేసింది. ఈ రైలుకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనాన్ని ఎప్పటికప్పుడు నింపేందుకు వీలుగా జింద్‌లో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక రీఫ్యూయలింగ్, నిల్వ కేంద్రాన్ని నిర్మించారు. ఈ కేంద్రంలో అత్యధిక ఒత్తిడితో కూడిన కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను సురక్షితంగా నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' నుంచి అవసరమైన అన్ని రకాల లైసెన్సులు, అనుమతులు లభించాయి.

**ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం**

హైడ్రోజన్ ఇంధన వినియోగంలో ప్రయాణికుల రక్షణకు రైల్వే శాఖ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది. జింద్‌లోని నూతన రీఫ్యూయలింగ్ కేంద్రంలో అత్యంత సున్నితమైన హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లతో సహా పలు అధునాతన భద్రతా సెన్సార్లను అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే ఈ రైలు రెగ్యులర్ నిర్వహణ (మెయింటెనెన్స్) కోసం ఢిల్లీ పరిధిలోని షకుర్‌బస్తీలో ప్రత్యేకంగా ఒక ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ కూడా అంతర్జాతీయ స్థాయి కఠినమైన భద్రతా ప్రమాణాలను అమలు చేయనున్నారు. 'రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్' ఆమోదించిన నిబంధనల ప్రకారమే ఈ రైలు నిర్వహణ జరుగుతుందని, ప్రత్యేక శిక్షణ పొందిన సాంకేతిక సిబ్బంది 24 గంటల పాటు నిరంతరం పర్యవేక్షిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రారంభ దశలో భాగంగా రైలు నడిచే సమయంలో లోపాలను గుర్తించేందుకు ప్రయాణికులతో పాటు ప్రత్యేక సాంకేతిక బృందం కూడా రైలులోనే ప్రయాణించి, దీని ప్రత్యక్ష పనితీరును నిశితంగా పర్యవేక్షించనుంది. ఈ వినూత్న ప్రాజెక్టు ద్వారా ఇంధన సామర్థ్యం, పర్యావరణ హిత రవాణా పట్ల తమకున్న అంకితభావాన్ని భారత

# 30న సీఎంగా డీకే ప్రమాణస్వీకారం?

**బెంగళూరు, మహా :** కర్నాటకలో సీఎం మార్పిడి ఖాయమైంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డీకే శివకుమార్ కు లైన్ క్లియర్ అయింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ ప్రస్తుత సీఎం సిద్ధరామయ్యను ఒప్పించింది. సిద్ధరామయ్యకు ప్రస్తుతం 78ఏళ్ళు. గురువారం ఏఐసీసీ నేతలు కేసీ వేణుగోపాల్, సూర్జేవాలా బెంగళూరు రానున్నారు. సిద్ధరామయ్య.. డీకే శివకుమార్ తో సహా మిగిలిన సీనియర్లతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు.. సీనియర్లకు దక్కే ప్రాధాన్యత గురించి వారు స్పష్టత ఇవ్వనున్నారు. ఆ తరువాత సిద్ధరామయ్య తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తారు. ఈ నెల 29న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసారు. పరిశీలకు సమక్షంలో డీకే శివకుమార్ ను తమ సీఎంగా ఖరారు చేయనున్నారు. అంతా అనుకున్నట్లుగా సవ్యంగా జరిగితే ఈ నెల 30న కర్ణాటక నూతన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసేలా ఏఐసీసీ స్కెచ్ సిద్ధం చేసింది. సిద్ధరామయ్య గురువారం గవర్నర్‌ను సమయం కోరడంతో ఆయన రాజీనామాకు సిద్ధపడినట్లు స్పష్టం అవుతోంది. అంతా సవ్యంగా జరిగితే ఈ నెల 30న నూతన సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



**ప్రమాణస్వీకారానికి రాహుల్, ప్రియాంక**

డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారానికి రాహుల్, ప్రియాంక సహా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం విజయ్ సైతం హాజరు కానున్నారు. గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నప్పటి నుంచి నాయకత్వ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి. గత 18 నెలలుగా డీకే శివకుమార్ అనుచరులు ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. పార్టీ పరిశీలకులు సీనియర్లతో ఒన్ టు ఒన్ భేటీ నిర్వహించనున్నారు. పార్టీ నిర్ణయంగా డీకే శివకుమార్ కు సహకరించాలని స్పష్టం చేసే విధంగా రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు.

## తుమ్మిడిహెట్టి ఎత్తుపై చర్చకు సిద్ధం

**మహారాష్ట్ర సీఎంకు రేవంత్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్, మహా :** తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత కీలకమైన అడుగు వేశారు. ప్రాజెక్టు రీడిజైనింగ్, ఎత్తు పెంపు అంశాలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సీఎం రేవంత్ రెడ్డి కీలక లేఖ రాశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపై సుదీర్ఘ చర్చకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గతంలో ప్రతిపాదించిన 148 మీటర్ల ఎఫ్ ఆర్ ఎల్ తెలంగాణ నీటి అవసరాలకు ఏమాత్రం సరిపోదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. బ్యారేజ్ ఎత్తు పెంపుపై మరోసారి ఇరు రాష్ట్రాలు సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు తెలంగాణ ఉన్నతాధికారులు, ప్రతినిధుల బృందానికి సమయం ఇవ్వాలని... త్వరలోనే సమావేశ తేదీని ఖరారు చేయాలని మహారాష్ట్ర సీఎంను కోరారు.

# చెరువు శిఖాన్ని ఆక్రమించిన మైహోమ్ సంస్థ.

**హైదరాబాద్,మహా :** మహానగరంలోని ఐటీ కారిడార్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ, చెరువు భూములను మింగేయాలని చూస్తున్న కబ్జారాయుళ్లకు, బడా రియల్ ఎస్టేట్ సంస్థలకు 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. మాదాపూర్ పరిధిలో అత్యంత ఖరీదైన మైహోమ్ రామేశ్వరరావు సంస్థకు చెందిన భూ ఆక్రమణలపై హైడ్రా అధికారులు పంజా విసిరారు. పక్కా ప్రణాళికతో చెరువు శిఖాన్ని (ఎఫ్‌టీఎల్) ఆక్రమించి, రూపురేఖలు మార్చేసి కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసిన వైనాన్ని బట్టబయలు చేస్తూ, మంగళవారం నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో ఆ భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు.



***మ్యాప్ నుంచే చెరువు మాయం!***

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ సర్వే నంబరు 7లో గల 6.05 ఎకరాల విస్తీర్ణం కలిగిన 'ఈదులకుంట' చెరువును కబ్జాల చెర నుంచి విడిపించినట్లు హైడ్రా అధికారికంగా ప్రకటించింది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువు నిండితే.. ఆ వరద నీరంతా కాలువ ద్వారా సహజసిద్ధంగా ఈదులకుంటకు చేరేది. అయితే, సదరు నిర్మాణ సంస్థ కబ్జాదారులు పక్కా స్కెచ్‌తో ఆ వరద కాలువను వేరే రూట్‌లోకి మళ్లించి (డైవర్ట్ చేసి) చెరువుకు నీరు చేరకుండా ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత చెరువు రూపురేఖలను మార్చేసి, హద్దులు చెరిపేసి.. అక్కడ భారీ స్కైస్క్రాపర్స్ భవన నిర్మాణాలే ఆలస్యం అనుకున్న తరుణంలో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. తమ్మిడికుంట ఈదులకుంట సున్నం చెరువులుగా గొలుసుకట్టుగా ఉన్న వ్యవస్థలో ఈదులకుంట మాయమవుతోందని ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కూడా కేసు నమోదైంది.

***శాటిలైట్ చిత్రాల ఆధారంగా గుట్టు రట్టు***

స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించగా అక్కడ చెరువు ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి. అనంతరం గ్రామ, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. అక్కడ 6.05 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)కి సంబంధించిన శాటిలైట్ చిత్రాలు కూడా పూసగుచ్చినట్లు నిర్ధారించాయి. దీంతో మంగళవారం హైడ్రా బలగాలు రంగంలోకి దిగి చెరువు పాత ఎఫ్‌టీఎల్ సరిహద్దులను (హద్దులు) ఖచ్చితంగా నిర్ధారించి, చుట్టూ రక్షణ ఫెన్సింగ్ (కంచె) వేశాయి.


**రూ.1,800 కోట్ల భూమికి విముక్తి**

ఈ ఆపరేషన్‌లో కేవలం 6.05 ఎకరాల ఈదులకుంట చెరువునే కాకుండా.. ఆ చెరువుకు ఆనుకుని ఉన్న సర్వే నంబరు 11/37లోని మరో 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం కబ్జారాయుళ్లు సర్వే నంబర్లు మార్చి దక్కించుకోవాలని చూడగా హైడ్రా ఆ కుట్రను భగ్నం చేసింది. ఈ రెండు స్థలాలను కలిపి మొత్తం 11.21 ఎకరాల విలువైన భూమిని ఆక్రమణల నుంచి కాపాడారు. ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం కేవలం మాదాపూర్ ఐటీ కారిడార్‌లోని ఈ ఒక్క ప్రాంతంలోనే దాదాపు రూ.1,800 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను హైడ్రా స్వాధీనం చేసుకున్నట్లయింది. స్వాధీనం చేసుకున్న ఈ స్థలం చుట్టూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టి, ఫెన్సింగ్ వేసే పనులను వేగవంతం చేశారు. ఎంతటి బడా సంస్థలైనా ప్రభుత్వ, చెరువు భూములను ఆక్రమిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఈ ఆపరేషన్ ద్వారా అధికారులు స్పష్టం చేశారు.

# అత్వెల్లి లో బరితెగించిన "అక్రమం"






**హైదరాబాద్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ మహా :** అత్వెల్లి లో అక్రమం బరితెగించింది.. రియల్ మాఫియా కన్ను పడితే చెరువులు నాలాలు, అలుగులు, తూములు ఖతమవుతున్నావు...మైల్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ యాజమాన్యం మొదటి వరుసలో ఉందనటానికి ఇదే నిలువెత్తు నిదర్శం. తమకున్న ధన, రాజకీయ పలుకుబడితో అధికార యంత్రాంగాన్ని నోట్ల కట్టలతో నోళ్లు మూయించి... లే అవుట్ అనుమతులు రాని చోటా అడ్డదారిలో ఇరిగేషన్ ఎన్వొసీలు పొంది నాలాలు అలుగులను మింగేసింది.. హెచ్ ఎం డీ ఏ నుంచి అనుమతులు సైతం పొందింది...అవినీతి అధికారుల ధన దాహానికి వందల ఏళ్ల నాటి పురాతన చెరువులు, కుంటలు వందల ఎకరాలకు సాగు నీరందించే నాలాలు, తూములను మూసి దర్జాగా వెంచర్ నిర్మాణం సాగిస్తోంది... 165 ఎకరాల్లో ఉన్న చెరువు నిండి భారీ వరద ప్రవాహానికి చెరువు కట్ట తెగితే పక్కనే ఉన్న గ్రామాలు, వెంచర్ లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏంటి..? ఆస్తి, ప్రాణనష్టం జరిగితే ఎవరు భాద్యత వహిస్తారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి...అడ్డదారిలో ఇరిగేషన్ ఎన్వొసీలు ఇచ్చిన అధికార్లపై కలెక్టర్ కన్నెర్ర చేసినట్లు తెలిసింది.అలాగే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల జాయింట్ సర్వే చేసి త్వరగా రిపోర్ట్ ను అందజేయాలనీ అదనపు కలెక్టర్ కు సూచించినట్లు సమాచారం..

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలో అత్వెల్లి గ్రామంలో గల పెద్ద చెరువు అలుగు, నాలాలను మింగి మైల్ స్టోన్ అనే మాయ కంపెనీ దురాక్రమణకు తెగబడింది. అనుమతులు రాని చోటా అడ్డదారిలో అడ్డగోలుగా లే అవుట్ అనుమతులు పొంది యదేచ్చగా వెంచర్ నిర్మాణం సాగిస్తోందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. 165ఎకరాల చెరువు కు ఎగువ ప్రాంతాన కురిసిన భారీ వర్షాల కారణంగా కాల్వల ద్వారా భారీ ఎత్తున వరద ప్రవాహం చెరువు లో చేరుతుందని, ప్రతి సంవత్సరం భారీ వర్షాలు కురుస్తున్నాయని వరద ప్రవాహం పొంగి పొర్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. రైతుల పొలాల మధ్యలో మయూరి అనే పేరుతో లే అవుట్ వేసి నాలాలు మూసి వేయటంతో తమ పంట పొలాలను వరదలు ముంచేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆనాడు లే అవుట్ నిర్మాణాన్ని అడ్డుకోలేక పోవటమే కారణమని దాని పర్యవసానం అనుభవిస్తున్నామని అత్వెల్లి రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు..అలాగే మైల్ స్టోన్ లే అవుట్ కు ఇరిగేషన్, హెచ్ ఎం డీ ఏ అధికారులు అడ్డదారిలో అడ్డగోలుగా అనుమతులు జారీ చేయటంతో మూడు తూములు (స్లూయిస్ లు )అలుగును మూసి. నాలాలు ఆక్రమించటం వలన భవిష్యత్ లో భారీ మూల్యం చెల్లించక తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.మైల్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనికి కొంతమంది భూములుఇచ్చారు మరి కొంతమంది ఇవ్వలేదు.. భూములు ఇవ్వని వారి పరిస్థితే ప్రశ్నర్థాకంగా మిగిలిందని స్థానిక ప్రజలతో పాటు,రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డదారిలో ఎనోసీలు ఇచ్చిన ఇరిగేషన్, వాటిని ఆధారంగా చేసుకొని లే అవుట్ కు అనుమతులు జారీ చేసిన హెచ్ ఎం డీ ఏ అధికార్లపై కలెక్టర్ కన్నెర్ర చేసినట్లు తెలిసింది. అలాగే ప్రత్యేకంగా టీమ్ ను ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే చేయించి పూర్తి స్థాయిలో నివేదిక అందజేయాలనీ అదనపు కలెక్టర్ ను కోరినట్లు సమాచారం.

### ఇరిగేషన్ ఎన్వొలీ ల జారీ పై విచారణ జరిపించాలి :నరేందర్ రెడ్డి మేడ్చల్ బీ జే పీ సీనియర్ నాయకులు



మేడ్చల్ అత్వెల్లి గ్రామంలో మైల్ స్టోన్ అనే నిర్మాణ సంస్థకు ఇరిగేషన్ అధికారులు అడ్డదారిలో ఎన్వొసీలు జారీ చేసారని జిల్లా కలెక్టర్ స్పందించి బహిరంగ విచారణ జరిపించాలని మేడ్చల్ బీ జే పీ పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి గోపన్న గారి నరేందర్ రెడ్డి కోరారు. అమాయక కొనుగోలు దారులు హెచ్ ఎం డీ ఏ అనుమతులు ఉన్నాయని ప్లాట్లు కొని నష్ట పోకముందే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కి తూములు, నాలాలు, అలుగులు మూసివేసి లే అవుట్ అనుమతులు ఇవ్వటం అధికారుల అవినీతి కి పరాకాష్టగా నిలుస్తోంది.. అక్రమాలకు పాల్పడ్డ అధికార్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

### లే అవుట్ అనుమతులు రద్దు చేయాలి :దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ



:ఇరిగేషన్ అధికారులు జారీ చేసిన ఎన్వొసిల ఆధారం చేసుకొని మైల్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ కి హెచ్ ఎం డీ ఏ జారీ చేసిన లే అవుట్ అనుమతులు రద్దు చేయాలని దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ సంబంధిత అధికార్లను డిమాండ్ చేశారు. మేడ్చల్ సర్కిల్ అత్వెల్లి గ్రామంలో వందల ఏళ్లనాటి సహజ సిద్ధంగా ఏర్పడ్డ చెరువు దాని అలుగు, నాలాలను గతంలో పనిచేసిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ధన దాహానికి కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు.కలెక్టర్ ప్రత్యేక టీమ్ ను ఏర్పాటు చేసి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అడ్డదారుల్లో జారీ చేసిన ఎన్వొసి లను పరిశీలించి వాస్తవాలు బట్ట బయలు చేయాలని అక్రమాలకు పాల్పడిన అవినీతి అధికార్లపై ఏ సీ బీ దృష్టి సారించాలని ఇంటి దొంగలన్ని కాపాడేందుకు ప్రస్తుతం పని చేస్తున్న ఇరిగేషన్ అధికార్లు ప్రయత్నం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్, కలెక్టర్ స్పందించి బహిరంగ విచారణ జరిపించాలని అలాగే లే అవుట్ అనుమతులు రద్దు చేయాలని ఆయన కోరారు.

# కబ్జాకోరులపై 'హైడ్రా' పంజా

హైదరాబాద్, మహా :మహానగరంలో కబ్జారాయుళ్లకు, అక్రమ నిర్మాణదారులకు హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) సింహస్వప్నంగా మారింది. మంగళవారం ఐటీ కారిడార్ పరిధిలో నిర్వహించిన భారీ ఆపరేషన్లో కోకాపేట, ఖానామెట్, భరత్‌నగర్ పరిసరాల్లోని అత్యంత విలువైన ప్రభుత్వ, చెరువు భూములను ఆక్రమణదారుల చెర నుంచి అధికారులు విడిపించారు. పక్కా ప్రణాళికతో నిర్వహించిన ఈ ఆపరేషన్ ద్వారా ఒక్కరోజే ఏకంగా రూ.4,117 కోట్ల విలువైన భూములకు విముక్తి కల్పించి, వాటి చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. మార్కెట్లో ఎకరా భూమి ధర సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.177 కోట్ల వరకు పలుకుతున్న అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో బడా రియల్టర్లు సాగిస్తున్న ఆగడాలకు అధికారులు గట్టి బ్రేక్ వేశారు.

**గోల్డ్‌ఫిష్ విల్లాల ఆటస్థలాలు నేలమట్టం**

అత్యంత విలాసవంతమైన కోకాపేట ప్రాంతంలో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు చేసిన అక్రమాలను ఈ ఆపరేషన్ బట్టబయలు చేసింది. కోకాపేటలోని కొత్త చెరువును లక్ష్యంగా చేసుకుని గోల్డ్‌ఫిష్‌కాలనీ పేరుతో వెలిసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ.. చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోని 1.09 ఎకరాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించింది. అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా.. మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి, విల్లా నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, పిల్లల ఆట స్థలాలను సర్వాంగ సుందరంగా నిర్మించింది. దీనిపై ప్రజావాణిలో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా దస్త్రాలను పరిశీలించిన హైడ్రా.. ఆ ప్రాంతం పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధి అని తేల్చింది. వెంటనే రంగంలోకి దిగి ఆ అక్రమ నిర్మాణాలను, గోడలను పూర్తిగా తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. అలాగే, కోకాపేట పెద్దచెరువు పరిధిలో వివిధ బహుళ అంతస్తుల సంస్థలు ఆక్రమించిన దాదాపు 22 ఎకరాల స్థలాన్ని కూడా కాపాడింది. ఈ ఒక్క ప్రాంతంలోనే కాపాడిన భూమి విలువ రూ.3 వేల కోట్లకు పైమాటేనని అధికారులు వెల్లడించారు.

**మ్యాప్ నుంచే చెరువు మాయం కుట్ర భగ్నం**

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలో ఉన్న ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే మాయం చేసేందుకు జరిగిన కుట్రను కూడా హైడ్రా అధికారులు తీవ్రంగా పరిగణించి అడ్డుకున్నారు. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువు నిండిన తర్వాత వరద నీరు కాలువ ద్వారా ఈదుల కుంటకు చేరుతుంది. అయితే, కబ్జాదారులు పక్కా స్కెచ్‌తో ఆ వరద కాలువను వేరే వైపు మళ్లించి చెరువు పూర్తిగా ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత స్కైస్క్రాపర్స్ నిర్మాణానికి భూమిని సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో సైతం కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో శాటిలైట్ చిత్రాలను పరిశీలించిన హైడ్రా అధికారులు, పాత ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి రూ.600 కోట్ల మార్కెట్ విలువ గల 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని కాపాడి కంచె వేశారు. దీనికి ఆనుకునే ఉన్న సర్వే నంబర్ 11/37లోని రూ.500 కోట్ల విలువైన మరో 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం కబ్జారాయుళ్లు సర్వే నంబర్లు మార్చి దక్కించుకోవాలని చూడగా.. ఆ భూమిని కూడా హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది.

**పరిహారం పొంది.. కబ్జా వదలకుండా..**

రహదారి విస్తరణ కోసం ప్రభుత్వ పరిహారం పొందినప్పటికీ స్థలాన్ని వదలని ఓ భూయజమానికి అధికారులు గట్టి బుద్ధిచెప్పారు. భరత్‌నగర్ ఖైతలాపూర్ హఫీజ్‌పేట్ రహదారి విస్తరణ పరిధిలో రెయిన్‌బో విస్టా మీదుగా రైల్వేట్రాక్ వరకు 100 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ గతంలో భూసేకరణ చేపట్టింది. భూయజమానికి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించినప్పటికీ.. రోడ్డుకు ఇవ్వాల్సిన 1700 గజాల స్థలాన్ని తన కబ్జాలోనే ఉంచుకుని అక్కడ కార్యాలయం, గోశాలను నిర్మించాడు. దీనివల్ల ఆ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో ఫిర్యాదులు అందుకున్న హైడ్రా బలగాలు.. జ్యుయెల్ హైట్ గేటెడ్ కమ్యూనిటీ ముందున్న ఆ అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చివేశాయి. సుమారు రూ.17 కోట్ల విలువైన ఈ స్థలాన్ని రోడ్డు విస్తరణ కోసం అప్పగించి, ప్రజా రవాణాకు మార్గాన్ని సుగమం చేశాయి.

# సీసీఐ పాపం ముమ్మాటి కి పాయల్ శంకర్ దే




ఆదిలాబాద్ మహా : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శిఖండి రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు.బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష,ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితర కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా పాయల్ శంకర్ రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్నా నియోజకవర్గ ప్రజలకొరిగిందేమీ లేదని విమర్శించారు. ఎప్పుడూ హైదరాబాద్ లో మంత్రుల పేషీల్లో తిరగడం, సీఎం ను కలిసి ఫోటో దిగి సీయం నావాడే మంత్రులు నావాళ్లే అంటూ ఆయన శిఖండి రాజకీయాలు చేస్తున్నాడని ఘాటుగా విమర్శించారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ లో చేరాలని ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సిద్దంగా ఉండాలన్నారు. కాని మళ్ళీ గెలవడం ఆయన జీవితంలో సాధ్యం కాదన్నారు.కేవలం సొంత ప్రయోజనాలు, లబ్ది కోసం మాత్రమే ఆయన ప్రయత్నం తప్ప ప్రజా ప్రయోజాలకోసం మాత్రం కాదన్నారు. నిజంగా ఆదిలాబాద్ ప్రజల మీద ప్రేముంటే సీసీఐని తుక్కుకింద అమ్మనిచ్చేవారు కాదన్నారు. ఎన్నికల కంటే ముందు సీసీఐ ని తెరిపిస్తానని వాగ్దానమిచ్చిన బీజేపీ పెద్దలు ఎమ్మెల్యే మాట తప్పారని విమర్శించారు. సీసీఐ పాపం ముమ్మాటికీ పాయల్ శంకర్ దే అన్నారు.ఇష్టం వచ్చినట్టు హామీలిచ్చి ప్రజలను వంచించారన్నారు.ఆయనవి కేవలం ఉత్తర కుమార ప్రగల్భాలు అని ఎద్దేవా చేసారు. సీసీఐని తుక్కుకింద అమ్ముతుంటే ఏం చేస్తున్నావని ప్రశ్నించారు. పాయల్ శంకర్ ఒక ఛీటర్ అని ఘాటైన వ్యాఖ్యలు చేసారు. పార్టీ ఆఫీస్ విషయంలో సొంత పార్టీ నే మోసం చేసిన ఘనుడన్నారు. అంతు కాకుండా సొంత పార్టీ ఎంపీ ఎదుగుదలకు కూడా అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. తన హెలీక్యాప్టర్ సోకుతో ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రులను ఇబ్బందులు పెట్టేవారన్నారు.ఆయన ఒక రాజకీయ వ్యభిచారి అని విమర్శించారు. అంతే కాకుండా మైనింగ్ మాఫియా, భూకబ్జా, బెదిరింపులతో దాదాపు 485 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు.ఆయన అక్రమాలపై త్వరలోనే ఎంక్వైరీ జరుగుతుందన్నారు. కాగజ్ నగర్ లో సీయం రేవంత్ రెడ్డి పర్యటనను శ్రేణులు ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . జొన్న రైతులు కూడా నిరాశ చెందవద్దని చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపడతుందని భరోసా నిచ్చారు. అటు బీజేపీ నేతల రాజకీయాలపై డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ భగ్గుమన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు.. ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలో బీజేపీ శ్రేణులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని మండిపడ్డారు. మరోవైపు గందరగోళ పరిస్థితుల కారణంగా లా అండ్ ఆర్డర్ ఇష్యూ వస్తుందన్ అనుమానంతో కోఆప్షన్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు తాను ప్రకటించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఖిజర్ పాషా, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి , కౌన్సిలర్లు చరణ్ గౌడ్, జీషాన్, అన్నపూర్ణ, స్వాతి, నర్మద,మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, కావేటి జ్యోతి, రషీద్ , మంచాల మల్లయ్య, బూర్ల శంకరయ్య రాంకుమార్ , రాజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

**మ్యారేజ్ బ్యూరో రంగంలో సేవలు అందిస్తున్న వారికి అవార్డులు**

బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



హైదరాబాద్, మహా : తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రవీంద్రభారతి వేదికగా జరిగిన ఈ వేడుకలో మ్యారేజ్ బ్యూరో రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నిర్వాహకులు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రముఖులు, సేవా కార్యక్రమాల్లో ముందుండే వ్యక్తులను ప్రతిష్ఠాత్మక అవార్డులతో సత్కరించారు.తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, సినీ, సామాజిక రంగ ప్రముఖులు హాజరై విజేతలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు సంవత్సర కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 1800కు పైగా వివాహాలు విజయవంతంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ వేడుకలో "శ్రీ మహానంది అవార్డు", "గౌతమ బుద్ధ సేవారత్న అవార్డు", "నటరాజ్ అవార్డు", "మ్యారేజ్ బ్యూరో ఐకాన్ అవార్డు", "మ్యారేజ్ బ్యూరో రత్న అవార్డు", "ఉత్తమ సేవారత్న అవార్డు", "శ్రమశక్తి అవార్డు" వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందజేశారు. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ... తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను కొనియాడారు. సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషిస్తున్న సభ్యులందరిని అభినందించారు. మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని మ్యారేజ్ బ్యూరోలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారికి వృత్తిపరమైన గౌరవం కల్పించడం, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలవడం తమ లక్ష్యమని తెలిపారు. సభ్యుల ఐక్యత, సేవాభావం, పరస్పర సహకారంతో సంస్థ మరింత బలోపేతమవుతోందన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత విజయవంతంగా నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యుల సమస్యలను ప్రభుత్వం తీర్చాలని కోరారు. ఈ వేడుకలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ వేడుకలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, గోపా ప్రెసిడెంట్ బండి, సాయన్న, ప్రముఖ వ్యాపారవేత్తలు సామ స్వరూప గౌడ్, మామిండ్ల మాధవి, దేవిక, శ్యామ్ రావు , ముదిరాజ్, జగదీష్ పటేల్, అంతటి మహేశ్వరి గౌడ్, ముక్కెర నిర్మల, ఐల రవీందర్ గౌడ్, మధుసూదన్ గౌడ్, మలుగారి శేఖర్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి మే 27 మహా :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం,మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారనీ, ఇంకా ఎంత ధాన్యం నిల్వలో ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుకు తూకం వేసిన ధాన్యానికి అనుగుణంగా సరిపడా లారీలు అందుబాటులో ఉన్నాయా లేదా అని అధికారులను ప్రశ్నించారు.ప్రతి రోజు కనీసం 4 లేదా 5 లారీల వరకు ధాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా నిరంతరం రవాణా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.వర్షాల కారణంగా ఎక్కడైనా తడిసిన ధాన్యం ఉన్నా కూడా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ధాన్యం విక్రయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# టీడీపీ మరో చారిత్రక అడుగు

**అమరావతి, మహా** : పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడు వేదికపై నుంచి నారా లోకేష్ అతిపెద్ద అనౌన్స్‌మెంట్ చేశారు. తెలుగుదేశం పార్టీ మహిళలకోసం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని మహానాడు వేదికపై నుంచి ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండా భవిష్యత్‌లో అన్ని ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వు చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడులో నారాలోకేష్ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయని.. కానీ.. తెలుగుదేశం పార్టీ దానితో సంబంధం లేకుండానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని లోకేష్ తెలిపారు."మన స్త్రీశక్తికి మరింత బలం ఇవ్వాలని చూస్తే దానికి ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. ఇప్పుడు ఒక ప్రతిపాదన చేస్తున్నాను. పార్లమెంట్ లో బిల్ పాస్ అయినా, అవ్వకపోయినా మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి... వచ్చే ఎన్నికల్లో 33% సీట్లు మహిళలకు ఇవ్వాలి... ఈ పవిత్ర మహానాడు వేదిక నుండి తాను ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు" నారా లోకేష్ ప్రకటించారు

మహిళా సాధికారత టీడీపీ విధానం.. నినాదం

మహిళా సాధికారతను టీడీపీ మాటల్లోనే కాదు చేతల్లో కూడా చూపుతుందని ఈ సందర్భంగా లోకేష్ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును తిరస్కరించి, మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించాయి. ఎన్నికల సమయంలో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడతాయి... కానీ ఎన్నికల తర్వాత మహిళలను మర్చిపోతాయి. కానీ తెలుగుదేశం విధానం.. నినాదం రెండూ మహిళల అభ్యున్నతే అని చెప్పారు. తాను విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాఠ్య పుస్తకాల్లో మహిళలు ఇంటి పనులు చేస్తున్నట్లుగా ఉన్న ఫోటోలను మార్చి.. మగవారు కూడా ఆ పనులు చేస్తున్నట్లుగా చూపించామని.. ఇంటి నుంచే మహిళలపై గౌరవం పెరగాలన్నది తమ సిద్ధాంతమని లోకేష్ తెలిపారు

**వచ్చే ఎన్నికల నుంచే అమలు**

రాష్ట్రంలో 2029 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మహిళలకు 33% సీట్లను కేటాయించాలని నిర్ణయించింది. మహిళా సాధికారితకు ప్రాధాన్యం ఇస్తూ తెలుగుదేశం పార్టీ తీసుకున్న అతి పెద్ద చారిత్రక ముందడుగు ఇదని లోకేష్ తెలిపారు. మహిళల అభ్యున్నతి మాటల్లో కాదని చేతల్లోనే చూపిస్తామని చెప్పారు. ."ఇది కేవలం ఒక నినాదంగా కాదు.. భారతదేశ భవిష్యత్తు పట్ల ఒక నిబద్ధతగా ఉండాలి. మాకు మరింత మంది మహిళా చట్టసభ సభ్యులు కావాలి... మరింత మంది మహిళా నాయకులు కావాలి... మరింత మంది మహిళా విధాన నిర్ణేతలు కావాలి. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును మహిళలు భుజం భుజం కలిపి నడిపిస్తారు. ఇది మా సంకల్పం...ఇది మా బాధ్యత...ఇది మా కమిట్‌మెంట్" అని స్పష్టం చేశారు. లోకేష్ తీర్మానం చేసిన తర్వాత మహిళా సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా హాజరైన వారు.. ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ విధానంలో హాజరైన వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**మొదటి పార్టీ తెలుగుదేశమే..**

మహిళలకు పార్టీలో రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించడం ద్వారా తెలుగుదేశం ఓ ముందడుగు వేసింది. మహిళలకు సంబంధించి చారిత్రక నిర్ణయాలు తీసుకోవడంలో ఆ పార్టీకి ఇంతకు ముందు కూడా ట్రాక్ రికార్డ్ ఉంది. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిహక్కు కల్పిస్తే.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విద్యాసంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు పార్టీ అభ్యర్థుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా టీడీపీ మరో మందుడుగు వేసింది.

# తైవాన్ గొప్పదనం ఇదే




**ప్రస్తుత ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని ఒక్కసారి గమనిస్తే.. ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బూమ్, సెమీకండక్టర్ చిప్స్, వాటన్నింటికీ కేంద్ర బిందువైన 'తైవాన్ సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ' గురించే చర్చ జరుగుతోంది. కేవలం 2.3 కోట్ల జనాభా ఉన్న ఒక చిన్న ద్వీప దేశం ప్రపంచ అగ్రరాజ్యాల గమనాన్ని సైతం శాసించడానికి కారణం టీఎంఎసి అనేదే పైకి కనిపించే సత్యం. కానీ, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులను లోతుగా పరిశీలిస్తే ఒక భిన్నమైన, అత్యంత శక్తివంతమైన వాస్తవం బయటపడుతుంది. తైవాన్ అసలు రక్షణ కవచం కేవలం ఒక చిప్ తయారీ కంపెనీ మాత్రమే కాదు ఆ దేశ స్టాక్ మార్కెట్‌ను నడిపిస్తున్న 80 శాతం రిటైల్ ఇన్వెస్టర్లు.**



భౌగోళిక రాజకీయాల వల్ల సమీకరణాలు మారినా, ఐపీ క్రేజ్ చల్లారినా... తైవాన్ మార్కెట్‌ను కూలిపోకుండా కాపాడే అంతర్గత బలం ఆ దేశ సాధారణ ప్రజల భాగస్వామ్యం. దురదృష్టవశాత్తూ, 140 కోట్లకు పైగా జనాభా ఉండి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశంగా చెప్పుకుంటున్న భారత్ దగ్గర ఈ "శాశ్వత ప్రజా బలం" ఇంకా పూర్తిస్థాయిలో లేదు. తైవాన్‌తో పోల్చి చూసినప్పుడు మన ఆర్థిక వ్యవస్థలో ఉన్న ఒక పెద్ద వెలితి ఇక్కడే స్పష్టమవుతోంది. గణాంకాలను ఒకసారి నిష్పాక్షికంగా విశ్లేషిస్తే, మన మార్కెట్ ఎంత నిస్సారమైన పునాదులపై నడుస్తోందో అర్థమవుతుంది. కేవలం 2.3 కోట్ల జనాభా ఉన్న తైవాన్‌లో ఏకంగా 53 శాతం మందికి స్టాక్ మార్కెట్ ఖాతాలు ఉన్నాయి. అక్కడ మార్కెట్ అనేది కొద్దిమంది కార్పొరేట్ దిగ్గజాల సొత్తు కాదు.. అది అచ్చంగా 'ప్రజల మార్కెట్' అయింది. 140 కోట్ల భారీ జనాభా కలిగిన మన దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య కేవలం 19.66 కోట్లు ). అందులోనూ నిలకడగా, యాక్టివ్‌గా పెట్టుబడి పెట్టే ఇన్వెస్టర్ల వాటా కేవలం 3 శాతం లోపే. ఈ అంకెలు ఏం చెబుతున్నాయి? పారిశ్రామికంగా, సాంకేతికంగా దేశం దూసుకుపోతున్నా.. సామాన్య భారతీయుడికి దేశ ఆర్థిక వృద్ధిలో భాగస్వామ్యం దక్కడం లేదు. 140 కోట్ల దేశంలో స్టాక్ మార్కెట్ అనేది ఇప్పటికీ ఒక వర్గానికో, లేదా కొద్దిమంది సమాచారమున్న వ్యక్తులు ఆడే ఆటగానో మిగిలిపోవడం కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే కాదు.. దశాబ్దాలుగా మనం మిస్ అవుతున్న ఒక అపారమైన అవకాశం మార్కెట్‌లో సాధారణ ప్రజల వాటా, లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) తక్కువగా ఉన్నప్పుడు అది కొన్ని శక్తుల చేతుల్లోకి వెళ్ళిపోతుంది.

### భారత్ ముందర ఉన్న అన్‌టాప్డ్ పొటెన్షియల్

భౌగోళికంగా తైవాన్‌కు ఉన్న అతిపెద్ద బలహీనత 'కాన్సంట్రేషన్ రిస్క్'. ఆ దేశ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 42 శాతం వాటా ఒక్క టీఎస్ఎంసీ మీదే ఆధారపడి ఉంది. రేపు చైనా గనుక తైవాన్‌పై దాడి చేస్తే, ఆ ఒక్క కంపెనీ దెబ్బతింటే తైవాన్ మార్కెట్ రాత్రికి రాత్రే శూన్యమవుతుంది. మనది ఒక రంగంపై ఆధారపడిన దేశం కాదు. మనకు బ్యాంకింగ్, ఎఫ్ ఎంసీజీ (నిత్యవసర వస్తువులు), ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లాంటి ఒక వైవిధ్యభరితమైన ఆర్థిక వ్యవస్థ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్జంప్షన్ స్టోరీ మనది. 140 కోట్ల మంది ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు వస్తువులను కొనే మార్కెట్ ఇది. కానీ విషాదం ఏంటంటే.. ఈ కన్జంప్షన్ స్టోరీ ద్వారా లాభపడుతున్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాల్సిన 97 శాతం మంది జనాభా ఇంకా మార్కెట్ బయటే ఉండిపోయారు. ఈ అపారమైన మానవ శక్తిని మార్కెట్ వైపు మళ్లించాలంటే కేవలం ప్రచారాలు సరిపోవు. యుద్ధప్రాతిపదికన మూడు పనులు జరగాలి:

1. **పాఠశాల స్థాయి నుంచే ఫైనాన్షియల్ లిటరసీ:** తైవాన్‌లో 20 ఏళ్ల లోపు యువతకు కూడా అసెట్ అలోకేషన్ (ఆస్తుల కేటాయింపు) పై అవగాహన ఉంది. మన దేశంలో కాలేజీలు దాటి, ఉద్యోగాల్లో చేరినా కనీస బేసిక్స్ తెలియడం లేదు. విద్యార్థి దశ నుంచే ఫైనాన్స్ అనేది ఒక ప్రధాన సబ్జెక్ట్ కావాలి.
2. **సెబీ కఠిన చర్యలు:** ముఖ్యంగా ఎస్ఎంఈ ఐపీఓలు (చిన్న తరహా కంపెనీల ఐపీఓలు) లో జరుగుతున్న అక్రమాలను, అడ్వాన్స్‌డ్ ట్రేడింగ్ అల్గారిథమ్స్ ద్వారా జరుగుతున్న నకిలీ వాల్యూమ్స్‌ను అరికట్టాలి. కొత్తగా మార్కెట్లోకి వచ్చే చిన్న ఇన్వెస్టర్ మొదటి అడుగులోనే మోసపోతే, వాడు జీవితంలో మళ్లీ స్టాక్ మార్కెట్ వైపు రాడు. రెగ్యులేటరీ వ్యవస్థలు మరింత కఠినంగా మారాలి.
3. **గ్రామీణ భారత్‌కు ఎస్ఐపీ కల్చర్:** మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ పెట్టుబడులు అనేవి కేవలం ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి మెట్రో నగరాలకే పరిమితం కాకూడదు. పల్లెల్లో ఉండే రైతులకు, చిన్న వ్యాపారులకు సైతం సురక్షితమైన మార్గాల ద్వారా ఇన్వెస్ట్ చేసే సౌకర్యం, అవగాహన పెరగాలి.

కంపెనీలు రావచ్చు, పోవచ్చు. టెక్నాలజీ ట్రెండ్స్ మారవచ్చు. జియోపాలిటిక్స్ తలకిందులు కావచ్చు. కానీ తైవాన్ ప్రజల్లో ఉన్న 53 శాతం మార్కెట్ భాగస్వామ్యం అనే పునాది ఆ దేశానికి అత్యంత పటిష్టమైన ఆర్థిక సార్వభౌమత్వాన్ని ఇచ్చింది.



భారత్‌లో కూడా అదే రోజు వచ్చి, మన 140 కోట్ల జనాభా ఆర్థికంగా మేల్కొని మార్కెట్ లోపలికి వస్తే... ఏ అంతర్జాతీయ శక్తులూ మన మార్కెట్లను శాసించలేవు. ఏ అమెరికా, ఏ చైనా మనల్ని దాటలేదు. మన అసలు బలం ఏదో ఒక ఐటీ కంపెనీనో, లేక రిలయన్సో, టాటానో కాదు... మన దేశంలోని కోట్ల మంది ఇన్వెస్టర్లు! ఆ అంతర్గత శక్తిని మేల్కొలిపి, ఒక సురక్షితమైన పెట్టుబడి వాతావరణాన్ని నిర్మించడమే నవభారతం ముందున్న అసలైన, అత్యవసరమైన టాస్క్.



### భారత్‌లో ప్రస్తుతం మనం చూస్తున్న ప్రధాన సమస్యలు ఇవే

1. **ఆపరేటర్ల రాజ్యం:** చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో తక్కువ వాల్యూమ్స్ ఉన్నప్పుడు, మార్కెట్ మానిప్యులేటర్లు లేదా ఆపరేటర్లు సులభంగా లోపలికి వస్తారు. కృత్రిమంగా డిమాండ్ సృష్టించి ధరలు పెంచడం , ఆ తర్వాత సామాన్యుడి నెత్తిన పెట్టి చేతులు దులేసుకోవడం ఇక్కడ రోజువారీ వ్యవహారంగా మారింది.
2. **డిజిటల్ ట్రాప్స్ :** నేడు సోషల్ మీడియా యుగంలో టెలిగ్రామ్ గ్రూపులు, యూట్యూబ్ ఛానెళ్ళు, ఇన్‌స్టాగ్రామ్ 'ఫిన్‌ఫ్లుయెన్సర్లు' ఇచ్చే "మల్టీబాగర్ టిప్స్" ఒక పెద్ద మాఫియాగా మారాయి. ఆర్థిక అవగాహన లేని అమాయకపు రిటైల్ ఇన్వెస్టర్ ఆ ఉచ్చులో పడి తన కష్టార్జితాన్ని కోల్పోతున్నాడు. చివరకు పెద్ద తిమింగలాలకు సేఫ్ ఎగ్జిట్ ఇచ్చే బాధితుడిగా మిగిలిపోతున్నాడు.
3. **నమ్మకం కోల్పోయే వినాశకర చక్రం:** ఒక్కసారి మార్కెట్‌లో మోసపోయిన లేదా నష్టపోయిన ఇన్వెస్టర్ జీవితంలో మళ్ళీ అటువైపు చూడడు. పైగా సమాజంలో స్టాక్ మార్కెట్ అంటే ఒక 'జూదం' అనే ముద్ర వేస్తాడు. తిరిగి సాంప్రదాయ బంగారం, రియల్ ఎస్టేట్ లాంటి తక్కువ ఉత్పాదకత కలిగిన రంగాల వైపే పరుగులు తీస్తాడు. భారత్‌లో దశాబ్దాలుగా ఈ వినాశకర చక్రమే తిరుగుతోంది. తైవాన్ రక్షణ కవచం ఇక్కడే పనిచేస్తుంది. అక్కడ 80% రిటైల్ పార్టిసిపేషన్ ఉండటం వల్ల ఏ ఒక్క ఆపరేటరో, లేదా ఒక గ్రూపో మార్కెట్‌ను తన ఇష్టానుసారంగా ఆడించలేదు. ఆ రక్షణ కవచం భారత్‌కూ అత్యంత అవసరం. మన మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు కేవలం 17 శాతం వాటాతోనే మొత్తం మార్కెట్ సెంటిమెంట్‌ను శాసిస్తున్నారు. అమెరికాలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచినా, మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం వచ్చినా, చైనా ఆర్థిక వ్యవస్థలో మార్పులు వచ్చినా... విదేశీ ఇన్వెస్టర్లు రాత్రికి రాత్రే మన మార్కెట్ నుండి నిధులు వెనక్కి తీసేసుకుంటారు. ఫలితంగా మన దేశీయ కంపెనీల్లో ఎలాంటి తప్పు లేకపోయినా మార్కెట్లు కుప్పకూలుతాయి. ఈ ఏడాది మనం కళ్లారా చూసింది ఇదే. అయితే, ఇందులో ఒక ఆశాకిరణం కూడా ఉంది. ఇటీవల మార్చి 2025 నాటి గణాంకాల ప్రకారం.. దేశ చరిత్రలోనే మొదటిసారిగా మన దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు విదేశీ ఇన్వెస్టర్ల వాటాను అధిగమించారు (17.62% వర్సెస్ 17.22%). ఇది సామాన్య ప్రజలు ప్రతి నెలా క్రమశిక్షణతో పెడుతున్న మ్యూచువల్ ఫండ్స్, ఎస్ ఐపీల ల ద్వారానే సాధ్యమైంది. అయితే, ఈ వేగం ఇంకా పెరగాలి. విదేశీయుల సెంటిమెంట్‌పై మన మార్కెట్ ఆధారపడటం తగ్గాలి.




# ఆవేదనా... ఆవేశమా...




రాజకీయాలలో ఎప్పుడూ పదవులు శాశ్వతం కాదు... కానీ ప్రజా ఆశీర్వాదంప్రధానం. ప్రస్తుతం రాజకీయ నేతలను పరిశీలిస్తే ప్రజా ఆశీర్వాదం కంటే పదవులే ముఖ్యమన్న తరహాలో కొనసాగుతున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. నేతలు చేస్తున్న ప్రకటనలు, వ్యవహరిస్తున్న తీరుపై ఈప్పుడు చర్చ జోరందుకుంది. రాజకీయాల్లో దూకుడు ఉండాలి, కానీ అది ప్రజల్లో విశ్వసనీయతను పెంచేలా ఉండాలి తప్ప.. ఆవేశంతో మాట్లాడి పార్టీని ఆత్మరక్షణలో పడేసేలా ఉండకూడదు. ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఇదే. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న తీరు, చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి మైలేజీని ఇవ్వడం కంటే వివాదాలకే ఎక్కువ దారితీస్తున్నాయి. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పోగొట్టుకున్న పదివిని తిరిగి లాక్కోవాలన్న తపనతో ఏం చేస్తున్నారు, ఏం మాట్లాడుతున్నారు, తాము చేస్తున్న వ్యాఖ్యలు, మాటలు ప్రజల్లోకి ఏ రకంగా వెళ్తున్నాయన్న స్పృహ కూడా లేకుండా వ్యవహరిస్తున్నారన్న చర్చ జోరందుకుంది. ఎంత దూసుకుడుగా వెళ్తే అంత తొరగా ప్రజలు తమను విశ్వసిస్తారన్న తపనా లేక అధికారం కోల్పోయామన్న ఆవేదనో తెలియదు కానీ వారు చేస్తున్న వ్యాఖ్యలు కొన్ని సందర్భాల్లో వెగటుగానూ, చట్ట వ్యతిరేకంగానూ ఉంటుండటంతో ప్రజల్లో నెగటివ్ ఆలోచనలకు తావిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

అధికారంలో ఉన్నంత కాలం తాము చెప్పిందే వేదం అన్నట్లగా ప్రవర్తించిన కొంత మంది నేతలు ఇప్పుడు అధికారంలో లేకున్నా తాము చెప్పిందే వేదంగా మారాలనుకుంటుండటం కూడా ఇందుకు కారణం కావచ్చు. ఏది మాట్లాడాలి, ఎప్పుడు మాట్లాడాలి, ఏది మాట్లాడ కూడదు, తాము మాట్లాడే మాటలతో ఎవరికి ఎంత మేర లాభం చేకూరుతుంది, ఎవరికి నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది, చట్టం పరిధిలోనే తాము చేసే వ్యాఖ్యలు ఉంటున్నాయా ? అన్న ఆలోచన లేకుండా మాట్లాడటంతో పార్టీ కేడర్ కూడా ఇబ్బందులకు గురవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే పరిస్థితిని ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి పరిస్థితి తయారైంది. పదేళ్ల అధికారానికి దూరం కావడాన్ని జీర్ణించుకోలేకనో లేక పట్టు కోల్పోతామన్న భయమో కానీ, పార్టీలోని కీలక యువనేతలు అనవసరమైన ఆవేశంతో వివాదాలను కొనితెచ్చుకుంటున్నారన్న చర్చ జోరందుకుంది. ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బాల్క సుమన్ వంటి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలు, హింసాత్మక పిలుపులకే మీడియాలో ప్రాధాన్యత లభిస్తుండటంతో పార్టీ అసలు ఎజెండా పక్కదారి పడుతోందని కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి చేస్తున్న కొన్ని వ్యాఖ్యలు హుందాగా లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బండి సంజయ్ కుమారుడికి సంబంధించిన కేసులను ప్రస్తావించడం, సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా ఆయన సొంత పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపవచ్చు కానీ, తటస్థ ఓటర్లలో మాత్రం ప్రతికూలతను పెంచుతున్నాయి. కేటీఆర్ ప్రజా సమస్యలపై, హామీల అమలుపై చేస్తున్న పోరాటం కూడా ఈ వివాదాస్పద వ్యాఖ్యల వెనుక మరుగున పడిపోతోంది. రాజకీయాల్లో ఆలోచనకు ఉన్న విలువ ఆవేశానికి ఉండదు అనే సత్యాన్ని యువ నాయకత్వం విస్మరిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన తాజా వ్యాఖ్యలు బీఆర్ఎస్‌ను మరింత ఇరకాటంలో పడేశాయి. మిలిటెంట్ తరహాలో దాడులు చేద్దాం, ప్రభుత్వ కార్యాలయాలను తగులబెట్టండి, రైలు పట్టాలను కోసేయండంటూ ఆయన ఇచ్చిన పిలుపు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. సింగరేణి ప్రాంతంలో రాజకీయ పట్టు నిలుపుకోవడం కోసం ఇలాంటి హింసాత్మక రాజకీయానికి తెరలేపడంపై మేధావి వర్గం తీవ్రంగా మండిపడుతోంది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి ప్రజా ఆస్తుల ధ్వంసానికి పిలుపునివ్వడం అంటే ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలిపెట్టు అని భావిస్తున్నారు. వాస్తవానికి ఇది మరోసారి మావోయిస్టు ప్రేరేపిత శక్తులకు ఊతమివ్వడమేనన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై యుద్ధం ప్రకటించి ఇప్పుడిప్పుడే మావోయిస్టు రహిత భారత్ గా మారుస్తున్నామని ప్రకటిస్తున్న తరుణంలో మరోసారి అదే తరహాలో హింసను ప్రేరేపించే విధంగా బాధ్యత కలిగిన నేత వ్యాఖ్యలు చేయడం ఏమిటన్న చర్చ జోరందుకుంది. గతంలో ఒక ఎమ్మెల్యే రాజ్యాంగపదవిలో ఉన్న అధికారి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం కూడా చర్చకు దారి తీసింది. ఒకరి తర్వాత ఒకరు ప్రజాకర్షణ కోసం చట్ట వ్యతిరేక, నిషేధిత పనులకు పాల్పడాలని పిలుపునివ్వడం, అధికారుల్లో నైతికతను దెబ్బ తీసేలా ప్రవర్తించడం ఎంత వరకు సరైందన్న చర్చ స్వంత పార్టీలోనే చర్చ జోరందుకుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు మౌనంగా ఉండగా, యువనేతలు మాత్రం మీడియా అటెన్షన్ కోసం చేస్తున్న ఈ అతి దూకుడు పార్టీని ప్రజలకు దూరం చేస్తోందనిన విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఉందన్న వాదన కూడా తెరపైకి వచ్చింది. ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిందే, కానీ అది నిర్మాణాత్మకంగా ఉండాలి. భాషాపరమైన హుందాతనాన్ని కోల్పోవడం వల్ల కేటీఆర్ వంటి నేతల క్రెడిబిలిటీ దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రజా సమస్యలపై గళం విప్పినప్పుడు అది వార్తల్లో నిలవాలంటే, దానికి వ్యక్తిగత దూషణలు తోడవ్వకూడదని అంటున్నారు. ప్రతిపక్ష పార్టీ నిర్మాణాత్మక పోరాటం చేస్తేనే ప్రజల్లో కోల్పోయిన విశఅవాసాన్ని తిరిగి సంపాదించుకునేందుకు వీలుంటుందన్న విషయాన్ని గుర్తెరిగి పప్రవర్తించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజా విశ్వాసాన్ని సంపాదించుకున్నప్పుడే రాజకీయ పార్టీల అనుగడ సాధ్యమవుతోంది. రాజకీయాల్లో నిలబడాలంటే ఓటర్ల నమ్మకం చాలా ముఖ్యం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవాల్సిన బీఆర్ఎస్, తన వివాదాస్పద వ్యాఖ్యలతో ప్రభుత్వానికి ఎదురుదాడి చేసే అవకాశం ఇస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నామనుకుంటున్న నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు, హింసాత్మక ఘటనలకు తావుండే విధంగా పిలుపులు ఇవ్వడంతో చేసిన పోరాటం కాస్త వృధా అవడంతో పాటు పార్టీ పట్ల వ్యతిరేకత పెరిగేలా చేస్తుంన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం కూడా ఉంది. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు చట్ట వ్యతిరేకమని, దీనిపై ఫిర్యాదులు చేయాలని ఇప్పటికే పాలకపక్షం శ్రేణులను కోరింది. ఈ ఫిర్యాదులతో పోలీసులు కేసులు పెట్టడం, జైలుకు పంపడం వంటి పరిణామాలు పార్టీకి సానుభూతిని తీసుకురావడం కంటే హింసావాద పార్టీ అనే ముద్ర పడ ప్రమాదం అందికంగా ఉంది. బీఆర్ఎస్ అధిష్ఠానం ఇప్పటికైనా మేల్కొని యువనేతలకు దిశానిర్దేశం చేయకపోతే, రాబోయే రోజుల్లో పార్టీ మరిన్ని కష్టాలను ఎదుర్కోవాల్సి రావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలు నాయకుడి నుండి ఆశించేది సమస్యల పరిష్కారం మరియు మెరుగైన భవిష్యత్తుపై భరోసా. కానీ, ప్రతిరోజూ మీడియాలో బూతులు, శాపనార్థాలు, హింసాత్మక పిలుపులు వినాల్సి వస్తే.. సాధారణ జనం ఆ పార్టీకి క్రమంగా దూరమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంతేకాకుండా క్రమక్రమంగా పార్టీ పట్ల ఉన్న సానుభూతి కూడా కనుమరుగయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీగా పాలకపక్షంపై నిర్మాణాత్మక పోరాటం చేయాలంటే ఏ రకంగా ముందుకు వెళ్ళాలి, ఏయే అంశాలను ప్రధానంగా ప్రజల ముందుంచాలన్న అంశాలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నాయకులకు మార్గదర్శనం చేసేందుకు పార్టీ సీనియర్లను తెరవెనుక బాధ్యతలను అప్పగిస్తే మరీ బాగుంటుంది.



గడ్డం కృష్ణమూర్తి
అసోసియేట్ ఎడిటర్



# నూతన డీఎస్పీ మాచర్ల అరుణ్ కుమార్‌కు ఘన సత్కారం

- **రోటరీ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ డా. భూషిరెడ్డి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అభినందనలు**

**భద్రాచలం మహా** : భద్రాచలం పట్టణంలో ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మాచర్ల అరుణ్ కుమార్ ను ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ డా. భూషిరెడ్డి శంకర్ రెడ్డి పాల్గొని డీఎస్పీకి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా భద్రాచలం రివర్ సైడ్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్, పూర్వ అధ్యక్షుడు డా. మడిపెద్ది రమేష్‌బాబు, బాచినేని రామకృష్ణ, ధనకొండ రాఘవయ్య, థాట్ల శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు డీఎస్పీ మాచర్ల అరుణ్ కుమార్‌కు దుశ్శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డా. భూషిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న భద్రాచలంలో శాంతి భద్రతలను సమర్థవంతంగా కాపాడుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. భద్రాద్రి ప్రాంతంలో సామరస్య వాతావరణాన్ని కొనసాగించడంలో డీఎస్పీ విజయవంతం కావాలని కోరారు కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.



# శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

**వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత**

**మహా వరంగల్ బ్యూరో;** శాంతియుత వాతావరణంలో ప్రజలు పండుగలను ఆనందంగా జరుపుకోవాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని డీసీపీ ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు.పండుగ ఏ మతానిది అయిన సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాజీపేట, హన్మకొండ ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నర్సింహారావు తో పాటు సెంట్రల్ జోన్ పరిధిలోని ఇన్స్ స్పెక్టర్లు అన్ని మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ మహిళకు రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేత

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సహాయం**

**బూర్గంపహాడ్ మహా** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాయం వెంకటేశ్వర్లు బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యక్కంటి మంగమ్మకు రూ.5 లక్షల విలువ గల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను అందజేశారు.యక్కంటి మంగమ్మ (భర్త: యక్కంటి అల్లూరి రెడ్డి) వైద్య చికిత్స నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలు వైద్య చికిత్స కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో యక్కంటి అల్లూరి రెడ్డి, నాగేశ్వర రెడ్డి కుమారుడు, సందా రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం పెంచిన చమురు ధరలను తగ్గించాలి

- **సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిమాండ్**



జూలూరుపాడు, మహా: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన చమురు ధరలను తగ్గించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంద పార్టీ డిమాండ్ చేసింది. బుధవారం తోటకూరి నరేష్ అధ్యక్షతన మండల కేంద్రంలో ఆ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి పార్టీ డివిజన్ కార్యదర్శి జె కృష్ణ మండల కార్యదర్శి బానోతు ధర్మ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన చమురు ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. దేశంలో నరేంద్ర మోడీ రైతు, ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నారని అన్నారు. చమురు ధరలు పెరగటంతో ప్రజలు వాడే నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో పాటు దేశ ప్రజలపై పన్నులు భారం పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. లేని ఎడల ప్రజా వ్యతిరేకతను చవిచూడక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీజిల్లా నాయకులు ఎదలపురం గోపాలరావు, మండల నాయకులు వీరభద్రం, ధనమంతరావు, రాయల సిద్దు, కుంచపు జమలయ్య, కల్తీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాదిహామీ కూలీల యాప్ తిప్పలు

**పని చేయకుండానే వెనుతిరిగిన ఉపాధి కూలీలు**

**దమ్మపేట, మే 27 మహా** :మండలంలో ఉపాది హామీ పనులకు వెళ్ళే కూలీల కు అధునాతన యాప్ మొరాయించడంతో పనుల ను వదిలేసి వెనుతిరుగుతున్నారు. సాంకేతిక లోపాలు పేద కూలీల పొట్ట కొడుతున్నాయి. చేతినిండా పని దొరికి, నాలుగు పైసలు వెనకేసుకుందామనుకున్న కూలీలకు స్మార్ట్‌ఫోన్ యాప్ శాపంగా మారింది. మండల పరిధిలోని జగ్గారం గ్రామ పంచాయతీలో బుధవారం ఉపాధి హామీ పథకం పనుల్లో తీవ్ర కలకలం రేగింది. పనుల వద్ద కూలీల ఫోటోలు ఆన్‌లైన్ కాకపోవడంతో, విసిగిపోయిన కూలీలు తీవ్ర నిరాశతో పని చేయకుండానే ఇళ్లకు వెనుతిరిగారు.



**సమస్యేమిటంటే..?**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత కోసం 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్' (యన్ యమ్ యమ్ యస్) యాప్ ద్వారా కూలీల హాజరు, ఫోటోలను ఆన్‌లైన్ చేయడం తప్పనిసరి చేసింది. అయితే, జగ్గారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి పనుల క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచే నెట్‌వర్క్ సమస్యలు, యాప్ సర్వర్ తలెక్కించడంతో కూలీల గ్రూప్ ఫోటోలు ఆన్‌లైన్ కాలేదు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఎంత ప్రయత్నించినప్పటికీ సాంకేతిక సమస్య వీడలేదు. ఉపాధి నిబంధనల ప్రకారం ఫోటో ఆన్‌లైన్ కాకపోతే ఆ రోజుకు సంబంధించిన వేతనం పడదు. గంటల తరబడి వేచి చూసినా సాఫ్ట్‌వేర్ ఓపెన్ కాకపోవడంతో, కష్టపడినా కూలి రాదనే భయంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి నిష్క్రమించారు.

**కూలీల ఆవేదన**

"పొద్దస్తమానం ఎండలో కష్టపడటానికి సిద్ధంగా ఉన్నాం. కానీ ఈ ఆన్‌లైన్ తిప్పల వల్ల మాకు పని దొరకకుండా పోతోంది. ఉదయాన్నే లేచి పనుల దగ్గరకు వస్తే, ఫోటో పడటం లేదని వెనక్కి పంపించేస్తే మా కుటుంబాలు ఎలా గడవాలి?" అని పలువురు కూలీలు కన్నీరుమున్నీరయ్యారు.

**అధికారులు స్పందించాలి**

ప్రాంతీయంగా నెట్‌వర్క్ సమస్యలు ఉన్నప్పుడు ఆఫ్‌లైన్ ద్వారా లేదా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో హాజరు తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని కూలీలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జగ్గారం గ్రామ పంచాయతీ ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని, సాంకేతిక లోపాలను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపివో సుధాకర్ ఏమంటున్నారంటే....**

వాస్తవంగా యాప్ మొరాయించడంతో కూలీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తెల్లవారుఝామున 4గంటలకే నిద్ర లేచి , మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్ లను అప్రమత్తం చేస్తున్నాను. గత రాత్రి వర్షాభావ ప్రభావం తో నెట్ వర్క్ లేక స్మార్ట్ ఫోన్ లు మొరాయిస్తున్నాయని తెలిసింది. ప్రత్యామ్నాయ పద్దతిలో పనులు చేయిస్తున్నాము. ఒకటి రెండుచోట్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు.

# వీవోఏ ఐకెపి రిలే దీక్షలకు సీపీఐ, ఏఐటీయూసీ మద్దతు..

- **కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి..**
- **హామీ మేరకు 20 వేల కనీస వేతనం చెల్లించాలి..**
- **సీపీఐ రాష్ట్ర నేత సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్..**



**మణుగూరు, మహా** : వీవోఏ, ఐకెపి కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మణుగూరు ఐకెపి కార్యాలయం ఎదుట వీవోఏ, ఐకెపి కార్మికులు సంయుక్తంగా నిర్వహిస్తున్న రిలే దీక్షలను బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీవోఏలు, ఐకెపి కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గతంలో గౌరవ వేతనాలు సరిపోవడం లేదని ఆందోళనలు చేపట్టిన సమయంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కనీస వేతనం రూ.20 వేలుగా పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏ, ఐకెపి కార్మికులు చేపడుతున్న ఆందోళనలు న్యాయమైనవేనని పేర్కొన్న ఆయన, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఇన్సూరెన్స్ సదుపాయం కూడా అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనం నిత్యావసరాల పెరుగుతున్న ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కష్టపడి పనిచేసినా సరైన వేతనం లేక అప్పుల పాలవుతున్న పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో వీవోఏలు, ఐకెపి కార్మికులు ప్రధాన భాగస్వాములుగా పనిచేస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్మికుల ఆందోళనకు సీపీఐ, ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దుర్గ్యాల సుధాకర్, గడ్డం వెంకటేశ్వర్లు, ఎస్కే సర్వర్, కొత్తపల్లి సీతారాములు, గోపిశెట్టి శివయ్య, ఆధర్ల రాములు, ఎం రమేష్, వెంకటేశ్వర్లు, పీఓఏ, ఐకెపి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, మహిళలకు మెన్స్ట్రువల్ హైజీన్‌పై అవగాహన

- **ఐటీసీ బంగారు భవిష్యత్తు వాష్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**బూర్గంపహాడ్ మహా** : బూర్గంపహాడ్ మండలంలోని మొరంపల్లిబంజర జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఐటీసీ బంగారు భవిష్యత్తు వాష్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులు మరియు గ్రామ మహిళలకు మెన్స్ట్రువల్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత మరియు మాసిక ధర్మ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమాదేవి మరియు వాష్ కమ్యూనిటీ ఆర్గనైజర్ అపర్ణ పాల్గొని విద్యార్థులు, మహిళలకు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ముఖ్యంగా మాసిక ధర్మ సమయంలో పరిశుభ్రత పాటించడం ఎంత అవసరమో వివరించి, సరైన హైజీన్ అలవాట్లు ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయని తెలిపారు.అలాగే మెన్స్ట్రువల్ హైజీన్‌పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించే దిశగా అవగాహన కల్పించారు. నెలసరి అనేది సహజమైన ప్రక్రియ అని, ఈ సమయంలో భయాలు లేదా సంకోచాలు అవసరం లేదని, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు.కార్యక్రమంలో గ్రామ మహిళలు, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని ఆసక్తిగా వినిపించారు. ఈ అవగాహన కార్యక్రమం మహిళల్లో మరియు బాలికల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.

# ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఉచిత గొడుగుల పంపిణీ..

- **భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా..**
- **ఎస్ఐఆర్ మ్యాపింగ్‌కు భరోసా హెల్పింగ్ సెంటర్..**



**మణుగూరు, మహా** : భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్యాలమ్మనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఉచితంగా గొడుగులు పంపిణీ చేయడంతో పాటు ఎస్ఐఆర్ మ్యాపింగ్ కోసం ప్రత్యేక హెల్పింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముత్యాలమ్మ నగర్ గ్రామ సర్పంచ్ కొమరం జంపేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండలు, వర్షాలు లెక్కచేయకుండా గ్రామాల్లో నిరంతరం సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లు, బీఎల్ఓల ఆరోగ్యం, సౌకర్యాలపై శ్రద్ధ చూపించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తినిస్తాయన్నారు. భరోసా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహమ్మద్ అమీనుద్దీన్ మాట్లాడుతూ, ప్రజా సేవలో ముందుండే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం తమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. చిన్న సహాయం ద్వారా వారి సేవలకు తోడ్పాటు అందించగలగడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు గ్రామస్తులకు 2002 రివైజ్డ్ ఓటర్ లిస్ట్‌లో తమ కుటుంబ సభ్యుల పేర్లను గుర్తించడంలో సహాయం చేశారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో భాగంగా తప్పిపోయిన పేర్లను గుర్తించడం, అవసరమైన కొత్త దరఖాస్తులు చేసుకునే విధంగా మార్గనిర్దేశం చేశారు. దీంతో గ్రామస్తులు అక్కడికక్కడే అవసరమైన వివరాలు తెలుసుకునే అవకాశం లభించింది. కార్యక్రమంలో శీను నాయక్, అబ్దుల్ గఫూర్, లీలా, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, బీఎల్ఓలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గొడుగులు అందుకున్న లబ్ధిదారులు భరోసా వెల్ఫేర్ సొసైటీతో పాటు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



భవన నిర్మాణ రంగంలో

# మేస్త్రీలు సెంట్రింగ్ కార్మికుల పాత్ర విడదీయరానిది

**బిఎన్ఆర్ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న**

**కుషాయిగూడ, మహా :** భవన నిర్మాణరంగంలో తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్ కార్మికుల పాత్ర విడదీయరానిదని, తాపీ మేస్త్రీలు సెంట్రింగ్ కార్మికులు గొప్ప అనుబంధంతో పనిచేస్తారని బిఎన్ఆర్ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న అన్నారు. జవహర్ నగర్ గిరిప్రసాద్ నగర్ భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో బుధవారం భవన నిర్మాణ రంగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తున్నందున జూన్ 8వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభకు సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐలన్న హాజరై మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమ్మె నేపథ్యంలో తాపీ మేస్త్రీలను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కార్మికుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు ఆత్మగౌరవ పరిరక్షణ కోసమే ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బియన్ఆర్ కెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య, గిరిప్రసాద్ నగర్ శాఖ అధ్యక్షులు సిహెచ్ వెంకటయ్య, ఉపాధ్యక్షులు కే. రామాచారి, రవీంద్ర చారి, కార్యదర్శులు రుక్మయ్య, సిపిఐ రాజేశ్వరి కాలనీ అధ్యక్షులు లింగోజి, బస్తి నాయకులు కురుమన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# జన గణనలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదు.

**కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత.**

**కుషాయిగూడ, మహా :** జన గణనలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించే రాదని ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు తీసుకోవాలని అధికారులను కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత ఆదేశించారు. జవహర్ నగర్ కార్యాలయంలో జన గణన పై డిప్యూటీ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సూపర్వైజర్లు ఎన్యూమరేటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ దేశంలో జన గణన రంగం సిద్ధమైన నేపథ్యంలో తొలిసారిగా పౌరులు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా స్వయంగా తమ సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చని భారత్ లో నివసిస్తున్న పౌరులకు మాత్రమే సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఆప్షన్ వర్తిస్తుందని చెప్పారు. జనాభా లెక్కల సమయంలో సేకరించి పౌరుల వ్యక్తిగత సమాచారం గోప్యమైందని ఆర్టిఐ కింద గాని కోర్టులో ముందు సాక్ష్యంగా గాని మరి ఇతర సంస్థలతోనూ పంచుకోరాదని స్పష్టం చేశారు. తెలంగాణలో ఇంటింటి సర్వే మే 11 నుండి జూన్ 9వ తారీకు వరకు నిర్వహిస్తున్నామని ఇందులో వలసలు వృత్తి విద్య సహా పౌరుల సామాజిక ఆర్థిక వివరాలు సేకరిస్తామని తెలిపారు. జనాభా లెక్కల లో గృహాల జాబితా గృహ గణ సందర్భంగా 33 ప్రశ్నలను సిబ్బంది అడుగుతారని తెలిపారు. సాధారణ జనాభాకు సంబంధించిన సందేహాలు స్వీయ గణనకు సంబంధించిన ప్రశ్నలు సహా అనేక రకాల అంశాలను ప్రస్తావించారు. జన గణన నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని తప్పుడు సమాచారం తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగేష్, సూపర్వైజర్లు, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఎసై ను సత్కరించిన యాదవసంఘం

**దమ్మపేట ,మే 27 మహా** :గతంలో తమ మండలంలో ఎసై గా ఉద్యోగ బాద్యతలు నిర్వహించి ,పలువురి మన్ననలు పొందిన ఎసై రాజేష్ కుమార్ ను చంద్రుగుండ యాదవసంఘం సబ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్బంగా అక్కడ చేసినటువంటి సామాజిక సేవలను గుర్తుచేశారు. అదేవిధంగా దమ్మపేట మండలానికి కూడా ఉద్యోగ ధర్మం తో పాటుగా సామాజిక సేవాకార్యక్రమాలలో చొరవ చూపించాలని ,శాంతిభద్రతల ను రక్షిస్తూనే మండల ప్రజల మన్ననలు పొందాలని పట్టణానికి చెందిన అద్వకేట్ గోళ్ళ భవాని కృష్ణ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో గోళ్ల భవాని కృష్ణ యాదవ్, కిలారి సుదర్శన్ యాదవ్, ఎనుముల గోపాలరావు, గండరపు సీతారాములు, జొనబోయిన సురేష్ యాదవ్ తదితర చంద్రుగుండ యాదవ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పేరుకే సింగరేణి చిల్డ్రన్ పార్క్..!

- కనుమరుగవుతున్న పచ్చదనం
- అలంకారప్రాయంగా వాటర్ ఫౌంటెన్లు
- మసక బారుతున్న చిల్డ్రన్ పార్క్ బోర్డు
- కనిపించని అహ్లాద సౌకర్యం
- షో చెట్లకు చెదలు.. కరువైన సంరక్షణ
- పట్టించుకునేది ఎవరు...?

**భద్రాద్రి బ్యూరో, మహా:**




సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలలో ప్రకృతి అందాలతో కూడిన పార్కులను గతంలో యాజమాన్యం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ పార్క్ ల ఏర్పాట్లలో భాగంగా కోల్ బెల్ట్ ఏరియాగా పేరొందిన కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద సింగరేణి చిల్డ్రన్ పార్క్ ను యాజమాన్యం ఏర్పాటు చేసింది. అయితే ఈ పార్క్ పై సరైన పర్యవేక్షణ లేని కారణంగా ప్రకృతి అందాలు కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొందని కొందరు సింగరేణి మాజీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ చిల్డ్రన్ పార్క్ ను ఏర్పాటు చేసిన సమయంలో మూడు వాటర్ ఫౌంటెన్ లు ఉండేవి. ఈ మూడు నీటి ఫౌంటెన్ లు పనిచేయక చాలా సంవత్సరాలు కావస్తుంది. నేటి వరకు వీటికి మరమ్మత్తులు చేయని కారణంగా అవి అలంకారప్రాయంగా మారడంతో పాటు చెత్తకుండీలా మాదిరిగా కనిపిస్తున్నాయి. దీంతో పార్కు అపరిశుభ్రంగా కనిపిస్తుందని సందర్శకులు ఆరోపిస్తున్నారు. సక్రమంగా పచ్చదనం లేదని ఉన్న వాటర్ ఫౌంటెన్లు దిష్టిబొమ్మల్లాగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా కూర్చోవడానికి బెంచీలు కూడా లేవని మండిపడుతున్నారు. సింగరేణి కార్మికులు వారి కుటుంబాల కోసం ఇతరులకు ఆహ్లాద సౌకర్యంగా ఉండాల్సిన చిల్డ్రన్ పార్క్ దశలవారీగా కలతపుతుందని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**షో చెట్లకు చెదలు...**





సింగరేణి చిల్డ్రన్ పార్క్ ఆవరణలో చుట్టూరా ఏర్పాటు చేసిన షో చెట్లకు చెదలుపడుతున్నాయి. చెట్ల మొదటి భాగం నుండి చెదల మట్టి పారుతూ పైకి వెళ్లడం వల్ల చెట్లల్లో బలం నశించిపోతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఈ చెట్లకు వచ్చిన చెదల నివారణకు రక్షణ చర్యలు చేపట్టడంలో పర్యవేక్షకులు పూర్తిగా విఫలమైనట్లుగా సందర్శకులు భావిస్తున్నారు. ఈ చెట్లు కూడా విరిగిపడిపోతే ఉన్న పచ్చదనం మరింత పలుచబడే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. తక్షణం సంబంధిత శాఖ అధికారులు స్పందించి పార్కులో చెట్ల సంరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### పార్కును అభివృద్ధి చేయాలి

కొత్తగూడెం బస్టాండ్ చౌరస్తాలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చిల్డ్రన్ పార్కు ను మరింత అభివృద్ధి చేయాలని అందుకు ప్రత్యేక బడ్జెట్ ను యాజమాన్యం కేటాయించాలని ఐఎఫ్టియు కార్మిక సంఘం నేత గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్కులో అలంకారప్రాయంగా ఉన్న మూడు వాటర్ ఫౌంటెన్ లను వినియోగంలోకి తీసుకువస్తే పార్కు రాత్రి సమయంలో మరింత అందంగా కనిపిస్తుందని సూచించారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. షో చెట్లకు వచ్చిన చెదలను నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిట్టింగ్ సౌకర్యం మరింత పెంచాలన్నారు. చిన్నపిల్లలు ఆటలు ఆడుకునేందుకు కొత్త ఆట సామాగ్రిని ఏర్పాటు చేయాలని గౌని నాగేశ్వరావు డిమాండ్ చేశారు.

## విద్యార్థులు చదువుకే ప్రాముఖ్యత ఇవ్వండి

- కల్లూరు ఏసిపి సుందర యాదవ్ (ఐపీఎస్)

**సత్తుపల్లి, మే 27**: మహా : విద్యార్థి చదువుకు విలువ ఇస్తే భవిష్యత్తు అందంగా ఆవిష్కరింపబడుతుందని కల్లూరు ఏసిపి వసుంధర అన్నారు. 2026 తెలంగాణ పాలిసెట్ ప్రవేశ పరీక్షల్లో 120/120 మార్కులు సాధించి సత్తుపల్లి కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటిన స్థానిక విశ్వశాంతి విద్యార్థి ఎం.డి అర్భాజ్ అలీ ను బుధవారం ఏసిపి తమ కార్యాలయంలో ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది తరాల పేదరికం ఒకే తరంలో పోగొట్టే శక్తి విద్యకు ఉన్నదని, పేదవాడు ధనికుడిగా కావాలంటే విద్య మూలధనం అన్నారు. విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమయపాలన, క్రమశిక్షణతో చదివితే అత్యున్నత శిఖరాలకు చేరవచ్చునని సూచించారు. విద్యలో రాష్ట్ర స్థాయి ఘనతను సాధించిన అర్భాజ్ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. విద్యార్థిని ప్రాథమిక విద్యా బోధనలతో తీర్చిదిద్దిన విశ్వశాంతి యాజమాన్యం పశువులేటి నాగేశ్వరరావును ఏసిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో నరుకుళ్ళ సత్యనారాయణ, విద్యార్థి తండ్రి అఫ్జల్ పాల్గొన్నారు.

## దక్షిణ అయోధ్యలో ధ్వంసమైన జాతీయ రహదారులు!

- పాలకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలకు నిలయంగా భద్రాచలం
- సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి
- ధ్వంసం అయిన జాతీయ రహదారిపై సిపిఐఎం ఆధ్వర్యంలో నిరసన



**భద్రాచలం మహా** : దక్షిణయోధ్యగా విరజిల్లుతున్న భద్రాచలం పట్టణంలో జాతీయ రహదారులు దారుణంగా ధ్వంసం అయిపోతున్నాయని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి అన్నారు. ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో పవిత్ర పుణ్యక్షేత్రం ప్రమాదాలకు నిలయంగా మారిందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సిపిఐఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మరమ్మతులకు గురైన ప్రమాదాలకు కారణమవుతున్న చర్ల రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ చర్ల వెంకటాపురం మండలాల నుండి వచ్చే ఇసుక లారీలతో భద్రాచలం నుండి వెంకటాపురం వరకు జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోతుందని అన్నారు. ప్రధానంగా భద్రాచలం పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుండి నన్నపనేని మోహన్ హైస్కూల్ వరకు తారుతో పోసిన జాతీయ రహదారి విధ్వంసం గా మారిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులు పర్ణశాలకు వెళ్లాలంటే చుక్కలు కనబడుతున్నాయని ఒక్కసారి ఈ రహదారిపై ప్రయాణించిన యాత్రికులు మరోసారి భద్రాచలం పేరు ఎత్తితేనే భయపడిపోయే పరిస్థితులు వచ్చాయని అన్నారు. జాతీయ రహదారుల మరమ్మతులు చేపట్టాలని సిపిఐఎం ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా దశల వారి ఉద్యమాలను చేస్తున్న పాలకులు స్పందించడం లేదని అన్నారు. సిపిఎం జిల్లా రాష్ట్ర స్థాయి నాయకత్వం పలుమార్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు వినతి పత్రాలు అందించారని నర్సారెడ్డి సందర్భంగా గుర్తు చేశారు. రోడ్డు భవనాల శాఖ మంత్రి తోపాటు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రెవిన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన హామీ ప్రకటనలకే పరిమితమైందని ఇప్పటివరకు రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం చొరవ చూపలేదని నర్సారెడ్డి ఆరోపించారు. ఇటీవల జరిగిన అత్యధిక రోడ్డు ప్రమాదాలు ఈ రహదారిపైనే జరిగిన పాలకులు స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రజా పాలన ప్రగతి పాలన పేరుతో సొంత ప్రచారాలు చేసుకుంటున్న ప్రభుత్వం దక్షిణాయోధ్య రహదారులపై శ్రద్ధ చూపాలని నరసారెడ్డి హితవు పలికారు. యుద్ధ ప్రాతిపదికన భద్రాచలం పట్టణంలోని జాతీయ రహదారి మరమ్మతులు పనులు చేపట్టకపోతే సిపిఐఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి పట్టణ కమిటీ సభ్యులు నకిరేకంటి నాగరాజు ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్ పార్టీ నాయకులు అంజి భూషణం శ్రీను రమేషు తదితరులు పాల్గొన్నారు

## సీనియర్ రిపోర్టర్ శ్రీరాం రమేష్ మృతి బాధాకరం

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సంతాపం**



మహా వరంగల్ బ్యూరో ; వరంగల్ జిల్లా వర్ధన్నపేట టౌన్‌కు చెందిన సీనియర్ రిపోర్టర్ శ్రీరాం రమేష్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందిన వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన రమేష్ మరణం మీడియా రంగానికి తీరని లోటని అన్నారు. వారి సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.
శ్రీరాం రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు.

## వరదలకు ముందుగానే గోదావరి కరకట్ట మరమ్మతులు చేపట్టాలి

- ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి : సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ



**భద్రాచలం మహా** : భద్రాచలం పట్టణాన్ని వరదల ముప్పు నుండి రక్షించే గోదావరి కరకట్ట మరమ్మతు పనులను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ డిమాండ్ చేసింది. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని కరకట్టను బలోపేతం చేయాలని పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా గోదావరి కరకట్ట ప్రాంతాన్ని పార్టీ నాయకులు పర్యటించి పరిశీలించారు. అనంతరం సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకుడు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏడాది వరదల సమయంలో భద్రాచలం ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. జూన్ నెల నుండి రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతు పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
వర్షాలు మొదలైన తర్వాత హడావుడిగా పనులు చేపట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం వరదల సమయంలో కరకట్టపై ఉన్న గోడ కూలిపోయినప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.కరకట్టలో ఉన్న లీకేజీలు, పగుళ్లు, స్లూయిజ్ సమస్యలు మరియు ఇతర ప్రమాదకర ప్రాంతాలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కరకట్ట మరమ్మతులకు తగిన నిధులు మంజూరు చేయించేలా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రతి సంవత్సరం కరకట్ట నిర్వహణ కోసం విడుదలయ్యే నిధులను సక్రమంగా వినియోగించి కరకట్ట నాణ్యతను కాపాడాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ హెచ్చరించింది.ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు దాసరి సాయి అన్న, మునిగేలా శివ ప్రశాంత్, బొర్రా శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ లబ్ధిదారులు తప్పనిసరిగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫోటో నమోదు చేయించుకోవాలి

**ఆధార్ కార్డుతో హాజరు కాకపోతే పెన్షన్ నిలిచిపోయే అవకాశం**

**చర్ల మహా** : చర్ల మండలంలోని ఆసరా, వితంతు, వికలాంగుల పెన్షన్ లబ్ధిదారులకు అధికారులు కీలక సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పెన్షన్లు పొందుతున్న ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా తమ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఆధార్ కార్డుతో ఫోటో నమోదు చేయించుకోవాలని సూచించారు. గత వారం నుండి ఈ ప్రక్రియ మండల వ్యాప్తంగా కొనసాగుతోందని సమాచారం. సంబంధిత లబ్ధిదారులు నిర్ణీత సమయంలో హాజరై వివరాలు నమోదు చేయించుకోకపోతే భవిష్యత్తులో వచ్చే పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వంటి పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న వారు ఈ సమాచారాన్ని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లాలని కోరుతున్నారు. చాలా మంది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ సమాచారం ఇంకా చేరకపోవడంతో వారు నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు గ్రామాల్లో టముకు వేయించి, ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి, ఒక్క లబ్ధిదారుడూ మిగలకుండా సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ సమాచారాన్ని చదివిన ప్రతి ఒక్కరూ తమకు తెలిసిన పెన్షన్ లబ్ధిదారులకు తెలియజేసి, అవసరమైన వారికి సహాయం చేయాలని ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సహకారంతోనే అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ సేవలను నిరంతరం పొందగలడని పేర్కొన్నారు.

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్యపడొద్దన్న విప్ బీర్ల అయిలయ్య
- ఆర్డీవోకు వెంటనే చర్యల ఆదేశాలు

**యాదాద్రి భువనగిరి మహా:** తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఆయన రైతులకు భరోసా కల్పించారు.రెండు రోజుల వివాహ వార్షికోత్సవ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే రైతుల సమస్యలపై స్పందించిన బీర్ల అయిలయ్య కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు.తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తి స్థాయిలో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు.

## పండిత్ జవహర్ లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం

**హన్మకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



మహా వరంగల్ బ్యూరో; భారతదేశ తొలి ప్రధాని, నవభారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 62వ వర్ధంతి కార్యక్రమం బుధవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ భవనంలో డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, గ్రంధాలయ ఛైర్మన్, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ బ్రిటీష్ పాలన లో సర్వస్వం కోల్పోయిన భారతదేశాన్ని ఒక శక్తివంతమైన దేశంగా మార్చిన ఘనత నెహ్రూ దేనని కొనియాడారు. సున్నా నుండి మొదలైన మన దేశ ప్రస్థానాన్ని, ప్రపంచ దేశాల సరసన నిలబెట్టిన ఆధునిక భారత శిల్పి, నాగార్జున సాగర్ భారీ ప్రాజెక్టులు, బిహెచ్ ఈఎల్ , హెచ్ ఎ ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఉక్కు కర్మాగారాలను స్థాపించింది నెహ్రూ అని గుర్తు చేశారు. నేడు భారతదేశం ఐటీ, స్పేస్ రంగంలో దూసుకుపోతుందంటే దానికి పునాది నెహ్రూ గారేనని, దేశంలో ఐఐటి లు, ఐఐఎం లు, ఏఐఐఎంఎస్ , ఇస్రో (అప్పటి ఇన్కోస్పార్) వంటి అత్యున్నత సంస్థలను స్థాపించి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందా అని ప్రపంచ దేశాలు హేళన చేశారు. కానీ నెహ్రూ బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థలకు, పార్లమెంటరీ విధానానికి పునాది వేసి, భారతదేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిపారని, ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఉన్నప్పుడు, ఏ అగ్రరాజ్యాల వైపు వెళ్లకుండా అలీన విధానాన్ని తీసుకొచ్చి, ప్రపంచ శాంతి కోసం 'పంచశీల' సూత్రాలను ప్రతిపాదించారని, భావి భారత పౌరులైన పిల్లల కోసమే ఆయన జీవితాన్ని అంకితం చేశారు. అందుకే పిల్లలంతా ఆయన్ను ప్రేమగా చాచా నెహ్రూ" అని పిలుచుకున్నారని కొనియాడారు. నెహ్రూ కేవలం కాంగ్రెస్ నాయకుడు మాత్రమే కాదు, ఈ దేశ ప్రతిష్టను హిమాలయాలంత ఎత్తుకు తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి. ఆయన వేసిన పునాదుల పైనే నేడు భారతదేశం నిలబడిందని. నేడు కొందరు చరిత్రను విస్మరించి నెహ్రూ పై బురదజల్లాలని చూస్తున్నారు. కాగా ఈ దేశ చరిత్రలో నుండి, ప్రజల గుండెల్లో నుండి నెహ్రూ పేరును ఎవరూ చెరిపివేయలేరని అన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే పాయం..

- కళ్యాణలక్ష్మి– షాదీముబారక్ చెక్కుల పంపిణీ..
- 23 మంది లబ్ధిదారులకు రూ.23.25 లక్షల ఆర్థిక సాయం..
- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే..
- గ్రామ సమస్యలపై వినతిపత్రాల స్వీకరణ



**మణుగూరు, మహా** : రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండలానికి చెందిన 23 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.23,25,668 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపడుచుల వివాహాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ అద్దంకి నరేష్, డీటీ రామారావు, ఆర్ఐ గోపి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు స్థిర నివాసం : ఎమ్మెల్యే**

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు కొల్లిపాక రమాదేవి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ, సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో పల్నాటి వెంకటేశ్వర్లు, హౌసింగ్ అధికారులు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, పాల్వంచ రాములు, గోరంట్ల కనకయ్య, పూనం రమేష్, జిల్లా నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు వినతిపత్రాలు స్వీకరించిన ఎమ్మెల్యే**

అల్లపల్లి మండలం పెద్దవెంకటాపురం, మణుగూరు మండలం రామానుజవరం, పినపాక మండలం కిష్టాపురం గ్రామపంచాయతీలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాలు అందజేశారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో పెద్దవెంకటాపురం సర్పంచ్ వజ్జ ఉమ, ఉపసర్పంచ్ కొమరం రాజేష్, రామానుజవరం సర్పంచ్ కలం కల్పన, ఉపసర్పంచ్ కొడారి రాణి, కిష్టాపురం సర్పంచ్ కె. పాపారావు, ఉపసర్పంచ్ నాగరాజు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంకు చెందిన యక్కంటి మంగమ్మకు వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.



## హీరో సూపర్ స్ప్లెండర్ ఎక్స్ టెక్ 2.0 విడుదల

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటో కార్ప్, మార్కెట్లోకి సరికొత్త 'హీరో సూపర్ స్ప్లెండర్ ఎక్స్ టెక్ 2.0' (Super Splendor XTEC 2.0) బైక్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధరను రూ. 86,500 గా నిర్ణయించారు. యువతను, రోజువారీ ప్రయాణికులను ఆకర్షించేలా రిఫ్రెష్డ్ డ్యూయల్‌టోన్ గ్రాఫిక్స్, 3D ఎంబ్లమ్, స్పోర్టీ రిమ్ టేపులతో ఈ బైక్‌ను మరింత ప్రీమియం లుక్‌లో డిజైన్ చేశారు. ఇందులో అమర్చిన 124.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజన్ 10.7 బీహెచ్‌పీ పవర్, 10.6 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అంతే కాకుండా, అడ్వాన్స్డ్ ప్రోగ్రామ్డ్ ఫ్యూయల్ ఇంజెక్షన్, i3S టెక్నాలజీల సహాయంతో ఇది లీటరుకు ఏకంగా 72 కిలోమీటర్ల అద్భుతమైన మైలేజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. సాంకేతికత విషయానికి వస్తే.. ఈ బైక్‌లో బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన పుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా రైడర్లు ప్రయాణంలోనే ఇన్‌కమింగ్ కాల్స్, SMS నోటిఫికేషన్లు, మిస్డ్ కాల్ అలర్ట్లు, ఫోన్ బ్యాటరీ స్టేటస్‌ను నేరుగా స్క్రీన్‌పైనే చూసుకోవచ్చు. వీటితో పాటు రియల్ టైమ్ మైలేజ్ ఇండికేటర్, లోఫ్యూయల్ ఇండికేటర్, మొబైల్ ఛార్జింగ్ కోసం 2A USB టైప్ సి పోర్ట్‌ను కూడా ఇందులో జతచేశారు. భద్రత, రైడింగ్ కంఫర్ట్‌కు ఈ సరికొత్త మోడల్‌లో పెద్దపీట వేశారు. సూపర్ స్ప్లె ండర్ సిరీస్‌లోనే మొదటిసారిగా ఇందులో 'హజార్డ్ లైట్లను' ప్రవేశపెట్టారు. మెరుగైన బ్రేకింగ్ కోసం ఫ్రంట్ డిస్క్ బ్రేక్, హ్యాండిల్‌బార్‌పైనే ఇంజన్ కిల్ స్విచ్‌ను అందించారు. లాంగ్ రైడింగ్‌లోనూ సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా విశాలమైన సీటు, టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్స్ సస్పెన్షన్‌ను అమర్చారు. ప్రస్తుతం ఈ బైక్ గ్లోసీ బ్లాక్, మ్యాట్ నెక్సస్ బ్లూ సహా ఐదు ఆకర్షణీయమైన రంగుల్లో దేశవ్యాప్తంగా ఉన్న హీరో డీలర్‌షిప్‌లలో విక్రయానికి సిద్ధంగా ఉంది.

### నందన్ నీలేకని వీసీ పెట్టుబడులు..

## రూ.3,000 కోట్లతో రెడీ



**న్యూఢిల్లీ:** సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ మాజీ ఈసీవో, సహవ్యవస్థాపకుడు నందన్ నీలేకని తాజాగా టెక్నాలజీ రంగంలో పెట్టుబడులకు తెరతీశారు. వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ ఫండమెంటమ్ పార్ట్‌నర్‌షిప్ ద్వారా ప్రత్యేకించిన ఫ్రంటియర్ టెక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. ఇందుకు ప్రాథమికంగా రూ. 3,000 కోట్ల మూలధనాన్ని సమకూర్చనున్నారు. దేశీయంగా ఏఐ, డీప్‌టెక్ కంపెనీల దన్నుతో ఫండమెంటమ్ ఫ్రంటియర్ అడ్వయిజర్స్(ఎఫ్2ఏ)ను ఏర్పాటు చేశారు. సెబీ అనుమతించిన తొలి ఫండ్.. ఫండమెంటమ్ 3- ఏఐ, డీప్‌టెక్ రూ. 2,000 కోట్లు సమకూర్చనున్నాయి. వీటికి అదనంగా ఎఫ్2ఏ మరో రూ. 1,000 కోట్ల సహపెట్టుబడులను సమీకరించనుంది. ఎఫ్2ఏ టెక్నాలజీ ఆధారిత బిజినెస్‌లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనుంది. ప్రధానంగా కన్జూమర్, ఎంటర్‌ప్రైజ్, ఫిజికల్ ఏఐను లక్ష్యంగా చేసుకోనుంది.

### హ్యుందాయ్ కార్లు..

## ఇక కొత్త రేట్లు

పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు, కార్యాచరణ వ్యయాల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రముఖ కార్ల తయారీ సంస్థ 'హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్' తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెరిగిన ధరలు జూన్ 1, 2026 నుండి అమల్లోకి రానున్నట్లు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ స్పష్టం చేసింది.వాహనాల మోడల్, వేరియంట్‌ను బట్టి ఈ ధరల పెంపు గరిష్ఠంగా రూ.12,800 వరకు ఉంటుందని సంస్థ పేర్కొంది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇటీవలె మరో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి సైతం తమ కార్లపై రూ.30,000 వరకు ధరలను పెంచిన సంగతి తెలిసిందే.ధరల పెంపు నిర్ణయానికి తోడు, కంపెనీ ఆర్థిక ఫలితాలు కూడా ఒత్తిడిని ప్రతిబింబిస్తున్నాయి. ఆటోమోటివ్ రంగంలో తీవ్రమైన పోటీ, మార్కెటింగ్ ఖర్చులు పెరగడంతో హ్యుందాయ్ ఇండియా నాలుగో త్రైమాసికంలో (Q4FY26) నికర లాభంలో 22.2% తగ్గుదలను నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ ఎబిటా మార్జిన్లు సైతం 14.1% నుండి 10.4% కి పడిపోయాయి. కోవిడ్ మహమ్మారి తర్వాతి కాలంలో విక్రేతలకు ఉన్న విపరీతమైన డిమాండ్ ఇప్పుడు కాస్త చల్లబడటం, మార్కెట్ వాటాను కాపాడుకోవడానికి భారీగా డిస్కౌంట్లు ఇవ్వాల్సి రావడం కంపెనీ నిర్వహణ లాభాలపై ప్రభావం చూపింది. అయితే, లాభాల పరంగా ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ కంపెనీ ఆదాయం మాత్రం ఆశాజనకంగానే ఉంది. మార్కెట్లో ఎస్‌యూవీలు (SUVs), హైవాల్యూ మోడళ్లకు కస్టమర్ల నుండి లభించిన బలమైన ఆదరణ కారణంగా హ్యుందాయ్ ఆదాయం 5.4% వృద్ధిని సాధించింది. కానీ, ఈ వృద్ధి పెరిగిన వ్యయాల వల్ల పూర్తిస్థాయి లాభాలుగా మారలేకపోయింది. కాగా, బాటమ్ లైన్ దెబ్బతిన్నప్పటికీ పెట్టుబడిదారులకు భరోసా ఇస్తూ, ఆర్థిక సంవత్సరం 2026 (FY26) కి గాను ప్రతి షేరుకు రూ.21 తుది డివిడెండ్‌ను హ్యుందాయ్ కంపెనీ బోర్డు సిఫార్సు చేసింది.




## టెలికం యూజర్లు @ 133.7 కోట్లు

### కొత్త వారిని ఆకర్షించడంలో ఎయిర్‌టెల్ టాప్



భారతీ ఎయిర్‌టెల్ కొత్త చందాదారులను ఆకర్షించడంలో ఏప్రిల్‌లోనూ ముందు నిలిచింది. 34.82 లక్షల కొత్త కస్టమర్లను సొంతం చేసుకుంది. ఇందులో 31.39 లక్షలు వైర్‌లెస్ (మొబైల్) విభాగం నుంచి ఉన్నారు. ఇదే నెలలో జియో 30.84 లక్షల కొత్త కస్టమర్లను ఆకర్షించి రెండో స్థానంలో నిలిచింది. ఇందులో 29.42 లక్షల మంది మొబైల్ చందాదారులు ఉన్నారు. ఏప్రిల్‌లో టెలికం చందాదారులు నికరంగా 69.5 లక్షలు పెరిగి 133.75 కోట్లకు చేరినట్లు ట్రాయ్ విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వొడాఫోన్ ఐడియా 53,257 మంది కొత్త కస్టమర్లను తన నెట్‌వర్క్ పరిధిలో చేర్చుకుంది. బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ కిందకు కొత్తగా 76,175 మంది వచ్చి చేరారు. వైర్‌లైన్ కస్టమర్ల సంఖ్య మార్చి చివరికి 4.82 కోట్లుగా ఉంటే, ఏప్రిల్ చివరికి 4.85 కోట్లకు పెరిగింది. ఇక మొత్తం మీద 52.69 కోట్ల చందాదారులతో పరిశ్రమలో రిలయన్స్ జియో నంబర్-1 స్థానంలో ఉంది. 37.3 కోట్ల మంది చందాదారులతో ఎయిర్‌టెల్, 12.8 కోట్ల మంది చందాదారులతో వొడాఫోన్ ఐడియా, 2.7 కోట్ల మంది చందాదారులతో బీఎస్‌ఎన్‌ఎల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రతీ కనెక్షన్‌ను ఒక సబ్‌స్క్రయిబర్‌గా పరిగణిస్తుంటారు.

### 'ప్రయారిటీ' వల్ల ప్రీపెయిడ్ సేవల నాణ్యత తగ్గదు: ఎయిర్‌టెల్

పోస్ట్ పెయిడ్ యూజర్ల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన 'ప్రయారిటీ' సర్వీస్ వల్ల ప్రీపెయిడ్ యూజర్లకు అందించే సేవల నాణ్యత తగ్గదని టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ తెలిపింది. నెట్ న్యూట్రాలిటీ నిబంధనలకు ఇది విరుద్ధం కాదని స్పష్టం చేసింది. దీనిపై పార్లమెంటరీ కమిటీతో జరిగిన సమావేశంలో కంపెనీ ఈ మేరకు వివరణ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మెరుగైన సేవలను అందించడానికి 5జీ ఫీచర్లను ఉపయోగించకపోనివ్వడం వల్ల రాబోయే 6జీ సేవలకు విఘాతం కలుగుతుందని సంస్థ పేర్కొంది. అధికంగా చెల్లించే పోస్ట్ పెయిడ్ యూజర్లకు రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో కూడా మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు నెట్‌వర్క్‌లోని కొంత భాగాన్ని ప్రత్యేకంగా కేటాయించేలా మే 19న ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్ పెయిడ్ ప్లాన్లను ప్రవేశపెట్టింది.



# తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం



**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేలు (వేలుమణి వర్గం) పళనిస్వామితో సమావేశమయ్యారు. పళనిస్వామితో రాజీపడ్డ తిరుగుబాట ఎమ్మెల్యేల వర్గం.. అన్నాడీఎంకేలో చీలిక లేదంటూ ప్రకటించారు. పళనిస్వామికి వేలుమణి బృందం పూర్తి మద్దతు తెలిపింది. పళనిస్వామితో సమావేశం అనంతరం స్పీకర్‌ను కలిసిన రెబల్ ఎమ్మెల్యేలు (వేలుమణి బృందం) తామంతా పార్టీగా మళ్లీ ఒకటిగా ఉన్నామంటూ స్పష్టం చేశాయి. తాము ఎల్లప్పుడూ కలిసికట్టుగానే ఉంటామంటూ తిరుగుబాటు ఎమ్మెల్యేలు.. పళనిస్వామి పట్ల తమ విధేయతను చాటుకున్నారు. ఎన్నికల ఓటమి తర్వాత పళనిస్వామికి వ్యతిరేకంగా సి.వి. షణ్ముగం నేతృత్వంలోని ఒక వర్గం ఎమ్మెల్యేలు తిరుగుబాటు జెండా ఎగురవేయడంతో అన్నాడీఎంకేలో కలకలం రేగిన సంగతి తెలిసిందే. ఈ వర్గం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రతిపాదించగా.. పళనిస్వామి తిరస్కరించారు. అయితే, తిరుగుబాటు వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు పళనిస్వామి మాటను పక్కనబెట్టి.. విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ వ్యవహారం ముదరడంతో తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ పళనిస్వామి స్పీకర్‌కు లేఖ కూడా రాశారు.స్పీకర్ కార్యాలయంలో అనర్హత వేటు ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తిరుగుబాటు వర్గానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకే పార్టీలో చేరడంతో ఆ వర్గానికి పెద్ద షాక్ తగిలింది. స్పీకర్ కార్యాలయంలో విచారణ జరుగుతున్నందున ఈ ఎమ్మెల్యేల రాజీనామాలపై ఈపీఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో ఎస్పీ వేలుమణి నేతృత్వంలోని తిరుగుబాటు నేతలు పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి నివాసంలో ఆయన్ను కలిసి సంధి ప్రకటించారు. ఈ సమావేశం అనంతరం పళనిస్వామి తమ నాయకుడని వారు స్పష్టం చేశారు. గతంలో కొన్ని భిన్నాభిప్రాయాల వల్లే ఈ తిరుగుబాటు జరిగిందంటూ పేర్కొన్నారు. సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని.. తమ డిమాండ్లను పరిశీలించడానికి పళనిస్వామి అంగీకరించారని నేతలు వెల్లడించారు. తిరుగుబాటుదారులు మళ్లీ సొంత పార్టీలోకి తిరిగి రావడంతో వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ కార్యాలయంలో దాఖలు చేసిన దరఖాస్తును పళనిస్వామి ఉపసంహరించుకున్నారు.

## అదే జరిగితే.. సీనియర్లకు 400 శాతం వేతనం పెంపు




**న్యూఢిల్లీ :** 8వ వేతన సంఘం జీతాల పెంపు విషయంలో కీలక ప్రతిపాదనలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. 8వ వేతన సంఘంతో సంప్రదింపులలో పాల్గొంటున్న ఒక కీలక ఉద్యోగుల సంఘం ఇండియన్ రైల్వే టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ప్రతిపాదించిన కొత్త ఐదుఅంచెల ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఫార్ములా ఈ చర్చకు కేంద్ర బిందువుగా ఉంది.దేశవ్యాప్తంగా ఉన్న కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్యత్తును నిర్ణయించే 8వ వేతన సంఘంపై చర్చలు మరింత ఆసక్తికరంగా మారాయి. దీంతోపాటు కొంతమంది సీనియర్ ప్రభుత్వ ఉద్యోగులకు 400 శాతానికి పైగా జీతాల పెంపును ప్రతిపాదించడం మరో విశేషం. కొత్త ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఫార్ములాసాధారణంగా గత పే కమిషన్లలో (ఉదాహరణకు 7వ పే కమిషన్‌లో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2.57గా ఉండేది) అందరు ఉద్యోగులకు ఒకే ఒక ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను వర్తింపజేసేవారు. కానీ ఈసారి IRTSA ఒక వినూత్న ప్రతిపాదన చేసింది.

### దీని ప్రకారం

Levels 1 నుండి 5 వరకు ఉన్నవారికి 2.92 ఫిట్‌మెంట్ కారకం లభిస్తుంది.
6 8 వరకు ఉన్నవారికి 3.50 లభిస్తుంది.
9 నుండి 12 వరకు ఉన్నవారికి 3.80 లభిస్తుంది.
13 నుండి 16 వరకు ఉన్నవారికి 4.09 లభిస్తుంది.
17 నుండి 18 వరకు ఉన్నవారికి 4.38 లభిస్తుంది.

ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే, జీతాలపై దాని ప్రభావం భారీగా ఉండవచ్చు. ఉదాహరణకు, 1718 లెవల్స్‌లో పరిధిలో రూ. 2.5 లక్షల బేసిక్ పే పొందుతున్న ఒక ఉద్యోగికి, ప్రతిపాదిత 4.38 కారకం ప్రకారం సవరించిన మూల వేతనం దాదాపు రూ. 10.95 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. అలాగే మధ్యస్థాయి ఉద్యోగులు (లెవెల్ 68): ప్రస్తుతం రూ. 45 వేల బేసిక్ పే ఉన్న ఉద్యోగి జీతం, ప్రతిపాదిత 3.50 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ప్రకారం రూ 1.57 లక్షలకు పెరుగుతుంది. 8వ వేతన సంఘం సిఫార్సులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలతో సహా 1.1 కోట్లకు పైగా లబ్ధిదారులను ప్రభావితం చేస్తాయని అంచనా. అయితే ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు మధ్య ఈ ప్రతిపాదనలు ఒకవైపు ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తిస్తుండగా, మరోవైపు ప్రభుత్వ ఖజానాపై పడే భారం వల్ల దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది.

### ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్

ఈ చర్చకు కేంద్రబిందువుగా ఉన్నది ఒక సాంకేతిక పదం, అదే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అంటే ఒక వేతన సంఘం కింద జీతాలను సవరించడానికి ఉపయోగించే గుణకం. దీని సూత్రం చాలా సులభం (కొత్త మూల వేతనం = ప్రస్తుత మూల వేతనం X ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్). ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 3.00 ఉంటే, ఉద్యోగి ప్రస్తుత బేసిక్ జీతం మూడు రెట్లు పెరుగుతుంది. 7వ వేతన సంఘం కింద ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 2.57గా నిర్ణయించారు. ఇప్పుడు, వివిధ రంగాలలోని ఉద్యోగ సంఘాలు అంతకంటే చాలా ఎక్కువ సంఖ్యలను డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంస్థలు 3.83 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను కోరాయి. మరికొన్ని అంతకు మించి కూడా వెళ్ళాయి. నేషనల్ కౌన్సిల్‌జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ కనీస మూల వేతనం రూ. 69,000గా ఉండాలని డిమాండ్ చేయగా, భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్ కూడా ఇదే డిమాండ్ చేసినట్లు సమాచారం.

### 8వ వేతన సంఘం: సంప్రదింపులు

ఇదిలా ఉండగా, 8వ వేతన సంఘం స్వయంగా విస్తృత సంప్రదింపుల దశలోకి ఎంట్రీ ఇచ్చింది. రిటైర్డ్ జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలోని ఈ కమిటీ ఇప్పటికే ఢిల్లీతో పాటు పలు ఇతర ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించింది. ఉద్యోగుల సంఘాలు, పెన్షనర్ల బృందాలు, ప్రభుత్వ సంస్థలతో దేశవ్యాప్తంగా జరిపే సంప్రదింపుల కార్యక్రమంలో భాగంగా, జూలై 6, 7 తేదీలలో భువనేశ్వర్‌లో పర్యటించనున్నట్లు ఇప్పుడు ప్రకటించింది. లక్నో, హైదరాబాద్, శ్రీనగర్, లడఖ్, జమ్మూ & కాశ్మీర్‌లలో కూడా సంప్రదింపులు జరపాలని కమిషన్ నిర్ణయించింది. 1946లో ప్రారంభమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రభుత్వం 2025 నవంబర్ 3న అధికారికంగా 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసింది.

## టీఎంసీకి ఎంపీ దస్తీదార్ రాజీనామా



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష తృణమూల్ కాంగ్రెస్‌లో అసంతృప్తి తారాస్థాయికి చేరుకుంది. బరాసత్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ అన్ని పార్టీ పదవులకు రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయంపై నైతిక బాధ్యత వహిస్తూ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం అనంతరం రాజకీయ కన్సల్టెన్సీ ఐపాక్‌పై దస్తిదార్ తీవ్ర విమర్శలు చేశారు. ఆ సమయంలోనే ఆమెకు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీతో పాటు ఇతర నేతలతో కూడా దూరం పెరిగింది. దీనితో తాత్కాలికంగా పార్టీ సమావేశాలకు దూరంగా ఉండాలని మమతా ఆదేశాలు జారీ చేశారు.అయినప్పటికీ మమతా బెనర్జీ నిర్వహించిన పరిపాలనా సమీక్ష సమావేశానికి దస్తిదార్ హాజరయ్యారు. పార్టీ ఆదేశాలు ఉన్నప్పటికీ ఆమె పాల్గొనడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ఈ నేపథ్యంలో బుధవారం దస్తిదార్ తృణమూల్ కాంగ్రెస్‌లోని జిల్లా అధ్యక్షురాలు పదవి, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు పదవి నుంచి తప్పుకున్నారు. పార్టీ నాయకత్వంతో అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నికల పరాజయాల తరువాత పలువురు నాయకులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామం బీజేపీ వంటి ప్రత్యర్థి పార్టీలకు రాజకీయ అవకాశాలను కల్పిస్తోంది.

## హైడ్రోజన్ రైలుకు గ్రీన్‌సిగ్నల్

### జింద్-సోనిపట్ మార్గంలో నడిపేందుకు రైల్వే శాఖ అనుమతి




**న్యూఢిల్లీ:** దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ రైలుకు కేంద్రం అనుమతి మంజూరు చేసింది. ఉత్తర రైల్వే జోన్ పరిధిలోని జింద్-సోనిపట్ మార్గంలో 10 బోగీలతో కూడిన ఈ రైలు గరిష్ఠంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంగా ప్రయాణించనుంది. డీజిల్, విద్యుత్ ద్వారా కాకుండా హైడ్రోజన్ బ్యాటరీల నుంచి అందే శక్తితో ఇది నడుస్తుంది.భద్రతా కారణాలను దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాలు ప్రారంభమైన మొదటి మూడు నెలల పాటు నిపుణులైన సిబ్బంది రైలులోనే అందుబాటులో ఉంటారని రైల్వే శాఖ తెలిపింది. అయితే, రైల్వే శాఖ అనుమతితో ఈ రైలు వెంటనే అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. పలు నిబంధనల అమలు ప్రక్రియలు, ధ్రువీకరణ దశలను దాటాల్సి ఉందని వివరించారు.

### హైడ్రోజన్ రైలు నడిచేదిలా..

సాంప్రదాయ డీజిల్ లేదా ఎలక్ట్రిక్ ఇంజిన్‌ల మాదిరిగా కాకుండా ఈ వినూత్న రైలు కదలడానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్ ఇంధన కణాలను ఉపయోగించి ఉత్పత్తి చేసుకుంటుంది. హైడ్రోజన్ ఇంధన ఘటాలు, ఆక్సిజన్‌తో కలిసి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, నీరు మాత్రమే వెలువడుతాయి. అంటే పర్యావరణానికి హానికరమైన ఎటువంటి ఉద్గారాలు ఉండవు. ఈ క్లీన్ ఎనర్జీ విధానం దేశంలో భవిష్యత్ రైళ్లకు ప్రమాణాన్ని ఏర్పరుస్తుందని భావిస్తున్నారు. దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ కోచ్‌ను గతేడాది జూలైలో చెన్నైలోని ఐసీఎఫ్ వద్ద రైల్వే శాఖ విజయవంతంగా పరీక్షించింది. భారత్ 1,200 HP పేరుతో అభివృద్ధి చేసిన హైడ్రోజన్ రైలు పనితీరును కూడా పరీక్షించేందుకు తాజాగా సిద్ధమైంది రైల్వే శాఖ. హైడ్రోజన్ రైలు అందుబాటులో వస్తే కాలుష్యం తగ్గడంతో పాటు భారతీయ రైల్వే టెక్నాలజీ పరంగా మరో మైలురాయిని అందుకుంటుంది.



# ఆయా షేర్... రికార్డ్

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైస్'. 'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇది. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో 'దసరా' వంటి హిట్ మూవీ నిర్మించిన సుధాకర్ చెరుకూరి 'ది ప్యారడైస్'ని నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్‌బాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ నుంచి నాని ఇంట్రో సాంగ్‌గా విడుదలైన తొలిపాట 'ఆయా షేర్...' కి అద్భుతమైన స్పందన వచ్చినట్లు చిత్రయూనిట్ పేర్కొంది. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈపాటని అద్దుల జంగిరెడ్డి, అర్జున్ చాందీపాడగా, సుధన్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈపాట తెలుగు వెర్షన్ 150 ప్లస్ మిలియన్ల వ్యూస్, 1.6 మిలియన్లకు పైగా లైక్స్ సాధించినట్లు పేర్కొని, నాని కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్.

"నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన చార్ట్‌బస్టర్‌గా 'ఆయా షేర్...' నిలిచింది. విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియా, కాలేజ్ ఫెస్ట్స్, పబ్లిక్ ఈవెంట్స్, డ్యాన్స్ వేదికలను షేక్ చేస్తూ ఈపాట ఒక కల్చరల్ ఫెనామినల్‌గా మారింది" అని చిత్రబృందం తెలిపింది. తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో ఆగస్టు 21న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ సాయి.

# విజయ్ నా తమ్ముడు అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నా : నటి



తమిళనాడులో కొత్తగా అధికారంలోకి వచ్చిన తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి విజయ్‌కు ప్రజలు, ప్రతిపక్షాలు కొంత సమయం ఇవ్వాలని ప్రముఖ సినీ నటి, బుల్లితెర నిర్మాతల సంఘం అధ్యక్షురాలు కుష్బూ అభిప్రాయపడ్డారు. కేవలం పది రోజుల్లోనే అన్ని మార్పులను ఎలా తీసుకురాగలరని ఆమె ప్రశ్నించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి విజయ్, విద్యా , సాంస్కృతితిక శాఖ మంత్రి రాజమోహనన్‌ను కుష్బూ నేతృత్వంలోని బుల్లితెర నిర్మాతల సంఘం ప్రతినిధులు కలిసి ఒక కోరికల వినతిపత్రాన్ని సమర్పించారు.

**సమస్యల పరిష్కారానికి సీఎం హామీ**

ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం కుష్బూ మీడియాతో మాట్లాడారు. బుల్లితెర రంగంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న, మధ్యతరహా నిర్మాతల సంక్షేమం కోసం కొన్ని ముఖ్యమైన డిమాండ్లను ముఖ్యమంత్రి ముందు ఉంచామన్నారు. తమ విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలించిన సీఎం విజయ్, మంత్రి రాజమోహన్ వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని కుష్బూ తెలిపారు.

**విజయ్ నా తమ్ముడు..**

ముఖ్యమంత్రి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కుష్బూ కాస్త భావోద్వేగానికి లోనయ్యారు. సీఎం విజయ్‌ను నా సొంత తమ్ముడిగా చెప్పుకోవడానికి నేను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు.. ఒక అక్కగా ఈరోజు ఆయనను ముఖ్యమంత్రి హోదాలో చూసినప్పుడు నా మనసు నిండిపోయిందంటూ చాలా ఎమోషనల్ అయ్యానని తెలిపారు. ఆయన పనితీరు, ఆలోచనలు చూస్తుంటే భవిష్యత్తులో తమిళనాడులో కచ్చితంగా ఒక మంచి మార్పును తీసుకువస్తారనే నమ్మకం నాకు కలిగిందన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నింటినీ ఒకే రోజులో సర్దుబాటు చేయడం ఎవరికైనా సాధ్యమేనా?, విజయ్ పగ్గాలు చేపట్టిన కేవలం 10 రోజుల్లోనే ఎలా మార్చగలరు? ముఖ్యమంత్రికి కాస్త సమయం ఇవ్వండి. తమిళనాడులో కచ్చితంగా మార్పు వస్తుంది అని వ్యాఖ్యలు చేశారు.



# వెకేషన్ మోడ్

వెకేషన్ మోడ్ ఆన్ చేశారు అల్లు అర్జున్. కొద్ది రోజులుగా 'రాకా' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్న అల్లు అర్జున్ కాస్త సేద తీరేందుకు కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లారు. ప్రస్తుతం ఆయన ప్యారిస్‌లో ఉన్నారని తెలిసింది. వచ్చే నెల ప్రారంభంలో ఇండియాకు వస్తారు అల్లు అర్జున్. 'రాకా' చిత్రానికి సంబంధించిన ఓ భారీ షెడ్యూల్ వచ్చే నెలలో ముంబైలో ప్రారంభం కానుంది. సినిమాలో కీలకమైన ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్‌తోపాటు ప్రధాన తారాగణంపాల్గొంటారని తెలిసింది. ఈ చిత్రంలో హీరోయిన్ దీపికా పదుకోన్ ఓ ప్రధానపాత్రలో నటిస్తున్నట్లుగా యూనిట్ ఆల్రెడీ ప్రకటించింది. ఇంకా హీరోయిన్స్ రష్మికా మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కూడా భాగం కానున్నారని సమాచారం. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ఈ సినిమా సాగుతుందని, ఇందులో అల్లు అర్జున్ తొలిసారిగా త్రిపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అట్లీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల కానుందని సమాచారం.



# సడన్‌గా సినిమాలు చేయడం ఎందుకు ఆపేసింది?

'ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే' అని అనగానే చాలామందికి గుర్తొచ్చే పేరు ముమైత్ ఖాన్. ఒక్క సాంగ్‌తో తెలుగులో ఈమె ఓవర్ నైట్ సెన్సేషన్ అయిపోయింది. ఐదారేళ్ల పాటు తెలుగులో అప్పటి స్టార్ హీరోలు అందరితోనూ కలిసి నటించింది. అలాంటి ముమైత్ అసలేమైపోయింది? ఇప్పుడేం చేస్తోంది? ఈమెకు పాకిస్తాన్ ఉన్న సంబంధమేంటి? ముమైత్ ఖాన్ పుట్టి పెరిగిందంతా ముంబైలో. ఈమె అసలు పేరు ఇది కాదు ముంతాజ్. సినిమాల్లోకి వచ్చిన తర్వాత తన పేరుని ముమైత్ అని మార్చుకుంది. 2001లో రిలీజైన తమిళ మూవీ 'మజ్ను'తో ఐటమ్ డ్యాన్సర్‌గా అరంగేట్రం చేసింది. తెలుగులో అయితే హరికృష్ణ హీరోగా నటించిన 'సామి'తో ఎంట్రీ ఇచ్చింది. తర్వాత ఛత్రపతి, యోగి, సామాన్యుడు, ఎవడైతే నాకేంటి, ఆపరేషన్ దుర్యధన, నేనింతే, మగధీర తదితర సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసి మెప్పించింది. ఓ హీరో మూవీ వస్తుందంటే ముమైత్ పాట కచ్చితంగా ఉండాల్సిందే అనే రేంజుకి వెళ్లింది. అలా 200611 మధ్య కాలంలో ఏడాది ఐదారు సినిమాలు చేసింది.ఐటమ్ సాంగ్సే కాదు మైసమ్మ ఐపీఎస్, మంగతాయారు టిఫిన్ సెంటర్ లాంటి మహిళా ప్రాధాన్య చిత్రాల్లో లీడ్ రోల్స్ కూడా చేసింది. అలాంటి ఉన్నట్లుండి ఒక్కసారిగా ఈమె సినిమాల్లో కనిపించడం మానేసింది. దీని గురించి ఓ సందర్భంలో మాట్లాడిన ముమైత్.. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు సినిమాలు మానేశానని అంతా అనుకున్నారు. కానీ నేనెప్పుడూ సినిమాలు మానలేదు, మానాలని అనుకోలేదు. యాక్సిడెంట్ జరిగింది. నా మెదడులో 5 నరాలు చిట్లాయి. ఈ ప్రమాదం తర్వాత కనీసం ఏడేళ్లు పని చేయకూడదని డాక్టర్లు చెప్పారు. చిన్న వస్తువు మోయడం కూడా చాలా కష్టంగా అనిపించేది. ఈ ప్రమాదం తర్వాత 15 రోజుల పాటు కోమాలో ఉన్నాను. దేవుడు నన్ను ముమైత్ ఖాన్‌గా మార్చాడు. ఆయనే దీనంతటికీ ఫుల్‌స్టాప్ పెట్టమని హింట్ ఇచ్చాడు. దాన్ని నేను అంగీకరించాను. ఏడేళ్ల పాటు నన్ను నేను తెలుసుకోవడానికి ఆ సమయాన్ని ఉపయోగించాను. ఈ సమయంలో నన్ను మా అమ్మే చూసుకుంది. నన్ను సంతోషంగా ఉంచడానికి ఏం చేయాలో అన్నీ చేసింది. నా లైఫ్ స్టైల్‌ని మారకుండా చూసుకుంది. ఈ ఏడేళ్లలో నాకేం ఇష్టమనే విషయాలను బాగా తెలుసుకున్నా. నేను బిజీగా ఉన్నప్పుడు హెయిర్ స్టైలింగ్‌కి, మేకప్ కిట్స్‌కి, స్టైయిలింగ్ టీమ్స్‌ని ముంబై నుంచి తెప్పించాల్సి వచ్చేది. వాటిని హైదరాబాద్‌లోనే ఎందుకు ఏర్పాటు చేయకూడదనే ఆలోచనతోనే వ్యాపారం మొదలెట్టా. ఇప్పుడు అదే నా కెరీర్‌గా ఎంచుకున్నానని గతంలో ముమైత్ చెప్పుకొచ్చింది. ఇక వ్యక్తిగత విషయానికొస్తే ముమైత్ తల్లిది తమిళనాడు కాగా తండ్రిది పాకిస్తాన్. ముమైత్ పుట్టిన తర్వాత వీళ్ల కుటుంబం ముంబైకి వచ్చేసింది. 13 ఏళ్ల వయసు నుంచే పని చేయడం మొదలెట్టిన ముమైత్ ఖాన్, చిన్నతనంలో ఆకలి కష్టాలని కూడా అనుభవించింది.



# టాలీవుడ్‌లో రీ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న హన్సిక

తెలుగులో తక్కువ సమయంలోనే స్టార్ గా మారిపోయిన భామ హన్సిక మోత్వానీ. దేశముదురు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. అల్లు అర్జున్ హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఆ సినిమా సమయంలో హాన్సిక వయసు కేవలం 15 ఏళ్లు కావడం గమనార్హం. తెలుగులో ఆమె చేసిన మొదటి సినిమా హిట్టు కావడంతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఆ తర్వాత టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుసగా అవకాశాలు అందుకుంది.అందం, అభినయంతో కుర్రకారు గుండెల్లో స్థానం సంపాదించుకుంది. అలాగే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి ప్రేక్షకులను కట్టిపడేసింది.ఈ సినిమా తర్వాత తెలుగులో కంత్రి, బిల్లా, మస్కా, కందిరీగ, పవర్, తెనాలి రామకృష్ణ, మైనేజ్ ఈజ్ శ్రుతి వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం తెలుగులో వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంటుంది. ఎక్కువగా తమిళం, హిందీలో అవకాశాలు అందుకుంటుంది హన్సిక.ఇటీవలే విడాకులు తీసుకున్న ఈ భామ.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన లేటెస్ట్ ఫొటోలతో కుర్రకారును నిద్రపట్టకుండా చేస్తుంది.



# త్రిష నలుపు దుస్తులు ధరిస్తే హిట్ పక్కా..

గత కొద్ది కాలంగా చర్చనీయాంశంగా మారిన నటి త్రిష. ఒక పక్క ఈ బ్యూటీ తమిళంలో అజిత్ కు జంటగా నటించిన విడాముయర్చి, కమలహాసన్‌తో కలిసి నటించిన థక్ లైఫ్ చిత్రాలు బ్యాక్ టూ బ్యాక్ అపజయం పాలవడం, ఆ తరువాత నటుడు ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ట్రోలింగ్‌లకు గురవడం వంటి విషయాలతో చాలా తలనొప్పికి గురైన త్రిష, ఎప్పుడైతే విజయ్ ఎన్నికల్లో గెలవడంతో పాటు పార్టీని ఒంటి చేతితో గెలిపించుకుని ముఖ్యమంత్రి అయ్యారో అప్పటి నుంచి త్రిష ఆనందంతో తుళ్లి పడుతున్నారనే చెప్పాలి. అదేవిధంగా నటి మంచి విజయాన్ని చూసి చాలా కాలం కావడంతో విచారంలో ఉన్న త్రిషకు కరుప్పు చిత్రం రూపంలో మంచి విజయం వరించింది. దీంతో ఈ బ్యూటీ రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారు. ఇకపోతే ఆమె తన అభిమాని వల్ల ఇంకా సంతోషానికి లోనవుతున్నారప్పుడు.

సూర్య, త్రిష జంటగా నటించిన కరుప్ప చిత్రం గత 15వ తేదీన విడుదలై ఘన విజయాన్ని సాధించింది. దీంతో సూర్య అభిమానుల ఆనందం గురించి పక్కన పెడితే త్రిష అభిమానులు తెగ సంబర పడుతున్నాయి. ఆమె అభిమాని ఒకరు త్రిషతో విజయ్ నటించిన ఘిల్లీ, అజిత్ నటించిన మంగాత్తా, సూర్య నటించిన ఆరు చిత్రాలు ఈ ముగ్గురు హీరోలకు చాలా మైలు రాయిగా నిలిచారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ మూడు చిత్రాల్లోనూ త్రిష నలుపు దుస్తులు ధరించారని, ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అందుకేనేమో ఆ మూడు చిత్రాలు మంచి విజయాన్ని సాధించి ఉంటాయన్నారు.

అందువల్ల త్రిషను కరుప్ప స్టార్ ( బ్లాక్ స్టార్) అని పిలవవచ్చు అని ఆ అభిమాని చేసి పోస్ట్ త్రిష వరకు చేరింది. ఆయన పోస్ట్‌ను చూసిన త్రిష ఎంతగానో సంతోషపడి ఇది చాలా అందంగా ఉంటుంది. ధన్యవాదా లు అని పేర్కొని చిరునవ్వుతో కూడిన పలు ఎమోజీలను ఎక్స్ మీడి యాలో పోస్ట్ చేశారు. ఆమె పోస్ట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com